మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 10-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 311 Issue: 311

10 మే 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:49 సూర్యాస్తమయం - సా. 6:35 తిథి అష్టమి మ. 3:01 వరకు తరువాత నవమి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం ధనిష్ఠ రా. 12:38o వరకు తరువాత శతభిష యోగం బ్రహ్మ రా. 1:57o వరకు కరణం కౌలవ మ. 3:01 వరకు తైతుల తె. 3:20o వరకు వర్జ్యం లేదు దుర్ముహూర్తం సా. 4:53 నుండి సా. 5:44 వరకు రాహుకాలం సా. 4:59 నుండి సా. 6:35 వరకు యమగండం మ. 12:12 నుండి మ. 1:48 వరకు గుళికాకాలం మ. 3:24 నుండి సా. 4:59 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:13 నుండి తె. 5:01 వరకు అమృత ఘడియలు మ. 1:47 నుండి మ. 3:29 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:38 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial

# విజయ ముహూర్తం

## నేడు ఉదయం 10 గంటలకు!

## సీఎంగా దళపతి ప్రమాణం

## 120కి చేరిన మద్దతుదారులు

## 13లోగా బల నిరూపణకు చాన్స్

చెన్నై: శనివారం గవర్నర్‌ను కలిసి తమకు మద్దతిచ్చిన పార్టీల లేఖలను అందజేసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని విజయ్ కోరారు. మెజార్టీ మార్క్ (118)కు చేరుకోవడంతో గవర్నర్ సమ్మతించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు చెన్నైలోని నెహ్రూ స్టేడియం వేదికగా టీవీకే చీఫ్ విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మే 13వ తేదీలోగా బల నిరూపణ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఏర్పాటులో టీవీకేకు మద్దతు తరువాయి 2 వ పేజీలో...



ఎట్టకేలకు తమిళనాడు ప్రభుత్వ ఏర్పాటుపై అనిశ్చితి వీడింది. అత్యధిక స్థానాలు గెలిచిన విజయ్ నేతృత్వంలోని టీవీకేకు కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతు తెలపడంతో ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ లైన్ క్లియర్ చేశారు. ఈ మేరకు తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్‌ను నియమిస్తూ లోక్‌భవన్ ఓ ప్రకటన విడుదల చేసింది.

# బండి సంజయ్ కొడుకుపై పోక్సో కేసు



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైంది. 17 సంవత్సరాల బాలికకు ఆల్కహాల్ తాగించి అత్యాచారం చేయించడంతో పేట్‌బషీరాబాద్‌లో కేసు పెట్టారు. బండి సంజయ్ కుమారుడు బలవంతంగా మద్యం తాగించి తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని 17 ఏళ్ల బాలిక ఫిర్యాదు చేసింది.

## అత్యాచారం చేశాడని మైనర్ ఫిర్యాదు.. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు

మేడ్చల్, మే 9 (ఈవార్తలు): హైదరాబాద్ మొయినాబాద్ ఫామ్‌హౌస్‌తో పాటు మరో రెండు ప్రాంతాల్లో అత్యాచారానికి పాల్పడ్డాడని తెలిపింది. దీంతో రెండుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించానని వెల్లడించింది. చివరకు శుక్రవారం అర్ధరాత్రి పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ముందుగా పోలీసులు కేసు నమోదుకు నిరాకరించారు. దీంతో దాదాపు ఆరు గంటల పాటు అక్కడ హైడ్రామా కొనసాగింది. బాధితురాలి తల్లిదండ్రులు కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించడంతో చివరకు బాధితురాలి నుంచి ఫిర్యాదు తీసుకుని, సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

### భగీరథ్ కూడా..

బండి సాయి భగీరథ్ కూడా శుక్రవారం కరీంనగర్ టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఇదే అంశంపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న ప్రకారం అమ్మాయితో పాటు ఆమె తల్లిదండ్రుల నుంచి వేధింపులు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఆ అమ్మాయి తనతో స్నేహం చేసిందని, ఫంక్షన్లు, కుటుంబంలో జరిగే శుభ కార్యాలకు తనను పిలిచేదని వివరించాడు. ఆమెతో కలిసి పవిత్ర పుణ్య క్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు తిరిగానని పేర్కొన్నారు. కొద్ది నెలల తరువాత పెళ్లి చేసుకోవాలని యువతి తరువాయి 2 వ పేజీలో...





## బెంగాల్ సీఎంగా సువేందు ప్రమాణం

ఆ రాష్ట్ర తొలి బీజేపీ సీఎంగా రికార్డు

హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ





బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)


| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,300 |
| వెండి (కిలో): | రూ.2,75,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,291 |

### విశ్వవాణి



భూమ్మీద అత్యంత వేగంగా పరుగెత్తగల జీవి చిరుత. అది 0 నుంచి 100 కిలోమీటర్ల వేగం అందుకోవడానికి కేవలం 3 సెకన్లు మాత్రమే తీసుకుంటుంది. భూమ్మీద ఉన్న ఏ లగ్జరీ కారు కూడా ఇంత త్వరగా వేగాన్ని అందుకోలేదు.

# బట్ట.. పొట్ట



## తెలంగాణ పురుషులకు ఎక్కడ లేని బాధలు

## దేశంలోనే అత్యధికంగా జుట్టు రాలే సమస్య

## వేగంగా క్షీణిస్తున్న జీర్ణక్రియ ఆరోగ్యం

## త్రయ హెల్త్ సర్వేలో ఆందోళనకర విషయాలు

పాపం మగాడు.. అసలే సంసార జీవితంలో పిప్పి అయిపోతున్నాడు. అందులోనూ తెలంగాణ మగాళ్ల పరిస్థితి మరీ దారుణం. అసలే ఉరుకుల పరుగుల జీవితంతో బాధపడుతున్న మనోళ్లకు మరిన్ని సమస్యలు చుట్టుముడుతున్నాయి. చిన్న వయసులోనే బట్ట.. పొట్ట వచ్చేస్తున్నాయట. తాజాగా, హెయిర్ కేర్ బ్రాండ్ త్రయ హెల్త్ నిర్వహించిన నేషనల్ గట్-హెయిర్ హెల్త్ సర్వేలో పలు ఆందోళనకర విషయాలు వెలుగులోకి వచ్చాయి.

హైదరాబాద్, మే 9 (ఈవార్తలు): తెలంగాణలోని పురుషులు దేశంలోనే అత్యంత వేగంగా జీర్ణక్రియ సమస్యలను ఎదుర్కొంటున్నారని, దీని ప్రభావం నేరుగా వారి జుట్టు రాలడంపై పడుతోందని అధ్యయనం వెల్లడించింది. దేశంలోని పది ప్రధాన రాష్ట్రాల్లో 1.6 లక్షల మంది పురుషులపై 2024 డిసెంబర్ నుండి 2025 -2 వ పేజీలో...

# బండి బర్తరఫ్ ఎప్పుడు?



## మోదీ తీసుకునే చర్యలేంటి?

## బేటీ బచావో ఉత్త నినాదమేనా?

### కేంద్రమంత్రి కొడుకు అని మినహాయింపు ఇస్తున్నరా?

### బాధితురాలికి రాహుల్ అండగా ఉంటరా? ఉండరా?

### నిలదీసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బండి సంజయ్ కొడుకుపై నమోదైన పోక్సో కేసుపై భారత రాష్ట్ర సమితి కేటీఆర్ స్పందించారు. బాధితురాలపై ఉల్టా కేసు పెట్టడంపై మండిపడిన ఆయన నరేంద్ర మోదీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం పైనా పలు ప్రశ్నలు సంధించారు. ఆ బాధిత బాలిక పరిస్థితి, ఆమె కుటుంబంపై జరుగుతున్న వేధింపులపై తీవ్రమైన ఆవేదన వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీని ఉద్దేశించి.. మీ 'బేటీ బచావో' కేవలం ఒక నినాదమేనా? కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై మీరు ఎలాంటి చర్య తీసుకోబోతున్నారు? కేంద్ర మంత్రి తనయుడు కాబట్టి అతడికి మినహాయింపు ఉంటుందా? బండి సంజయ్ ఎప్పుడు రాజీనామా చేస్తారు? ఆయనను మంత్రివర్గం నుండి ఎప్పుడు బర్తరఫ్ చేస్తారు? అని కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు.

హైదరాబాద్, మే 9 (ఈవార్తలు): అధికారంలోని కాంగ్రెస్‌ను కూడా కేటీఆర్ వదల్లేదు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీని ఆయన సూటిగా ప్రశ్నించారు. 'తెలంగాణలో మీ పార్టీ ఎలాంటి 'జంగిల్ రాజ్' నడుపుతోంది? ఒక మైనర్ బాలిక అన్ని ఆధారాలతో వచ్చినప్పుడు పోలీస్ శాఖ అత్యంత వేగంగా ఎందుకు స్పందించలేదు? కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడిపై ఇతర పోక్సో నేరస్తుల మాదిరిగానే కేసు నమోదు చేసి తరువాయి 2 వ పేజీలో...

# రిజిస్ట్రేషన్ జల్దీ

## పెరిగిన భూ లావాదేవీలు.. ధరల సవరణ ఎఫెక్ట్

## కార్యాలయాల పనివేళలు పెంపు.. మంత్రి పొంగులేటి ఆదేశాలు



తెలంగాణలో భూముల ధరలను సవరించాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చుతగ్గులున్న భూముల ధరలను క్రమబద్ధీకరించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అలాగే పనివేళలు సవరించాలని కూడా నిర్ణయించారు. రిజిస్ట్రేషన్లకు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

హైదరాబాద్, మే 9 (ఈవార్తలు): రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధిక రద్దీ ఉన్న చంపాపేట, సరూర్ నగర్, వనస్థలిపురం, గండిపేట్, మహేశ్వరం, షాద్ నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్గొండ, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్, ఫరూఖ్ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి సాయంత్రం ఆరున్నర గంటల వరకు పని వేళలను 12వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు చెప్పారు. ఈ 15 సబ్ తరువాయి 2 వ పేజీలో...

# హైదరాబాద్ పరువుపాయే!

## ఐపీఎస్ అధికారి భార్యను హత్య చేస్తే పట్టుకొనే దిక్కులేదు

## కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీమంత్రి హరీశ్ రావు ధ్వజం




కరీంనగర్‌లో గోల్డ్ షాపులో దొంగలు పడితే.. ఆ బంగారం చోరీ చేసిన దొంగల ఇప్పటికే దేశం విడిచి పారిపోయారని సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. వాళ్లను పట్టుకోరా అంటే చాత కాదు. పట్టపగలు కరీంనగర్ నడిబొడ్డున కిలోల కొద్దీ దొంగతనం చేసి దేశం విడిచి పారిపోతే వాళ్లను పట్టుకునే తెలివి లేదు.

హైదరాబాద్, మే 9 (ఈవార్తలు): మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి రాత్రి పోయి రోడ్డుపై నిలబడితే పోకిరీలు వచ్చి ఏ రకంగా ప్రవర్తించారో.. మహిళలపై ఎలా ప్రవర్తిస్తున్నారో ఆమె స్వయంగా సోషల్ మీడియాలో పెట్టారు. అంటే రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి ఎంత దారుణంగా తయారయ్యిందో మనకర్థమవుతోంది. హైదరాబాద్ నడిబొడ్డున ఓ సీనియం -2 వ పేజీలో...

# అగ్ని ఆన్ ఫైర్

## ఒకేసారి రెండు లక్ష్యాల ఛేదన.. పరీక్షించిన భారత రక్షణ శాఖ



పూరి: ఆధునీకరించిన అగ్ని క్షిపణిని భారత్ విజయవంతంగా పరీక్షించింది. ఒడిశాలోని అబ్దుల్ కలామ్ ఐల్యాండ్ నుండి మల్టిపుల్ ఇండిపెండెంట్‌లీ టార్గెట్‌బుల్ (బహుళ స్వతంత్ర లక్ష్యాలు కలిగిన) రీ ఎంట్రీ వెహికల్ (ఎంఐఆర్‌వి) తో ఈ పరీక్షను చేపట్టారు. ఒకే క్షిపణి ద్వారా వేర్వేరు ప్రదేశాల్లో బహుళ వార్ హెడ్‌లను ప్రయోగించగలిగేందుకు ఈ ఎంఐఆర్‌వి అవకాశం కల్పిస్తుంది. ఈ క్షిపణి వ్యవస్థను శుక్రవారం పరీక్షించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. హిందూ మహా సముద్ర ప్రాంతంలో విస్తారమైన ఏరియాలో వేర్వేరు చోట్ల వివిధ లక్ష్యాలను లక్ష్యంగా చేసుకుని పలు పేలోడ్‌లతో ఈ క్షిపణిని పరీక్షించినట్లు రక్షణ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ప్రయోగం తరువాయి 2 వ పేజీలో...



# నేడు హైదరాబాద్‌కు ప్రధాని మోదీ

## నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం హైదరాబాద్ పర్యటనకు రానున్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభలో మోదీ పాల్గొని ప్రసంగించనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో అటు పోలీసులు, ఇటు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశాయి.

హైదరాబాద్, మే 9 (ఈవార్తలు): ప్రధాని మోదీ రేపు మధ్యాహ్నం 2:50 నిమిషాలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా సభ జరిగే పరేడ్ గ్రౌండ్స్‌కు బయలుదేరుతారు. ప్రధాని పర్యటనను దృష్టిలో ఉంచుకుని పోలీసులు అత్యంత కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో మూడంచెల భద్రతా వలయాన్ని నిర్మించారు. సుమారు 2,000 మందికి -2 వ పేజీలో...



# ఢిల్లీలో హై అలర్ట్

## ఉగ్రదాడుల హెచ్చరికలు

న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని కీలకమైన ప్రదేశాల్లో ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్‌ల (ఐఈడీలు)తో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాల సమాచారం అందడంతో హైఅలర్ట్ ప్రకటించారు. జాతీయ వార్త సంస్థ ఇండియా టుడేకు నిఘా వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం ఉగ్రవాదులు తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

10.5.2026

మేషం: కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చేయవలసి వస్తుంది. చేపట్టిన వ్యవహారాలలో అవాంతరాలు తప్పవు. నూతన ఋణయత్నాలు చేస్తారు. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. గృహ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి.

వృషభం: ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహపరుస్తాయి. మిత్రులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. ప్రయాణాలలో జాగ్రత్తగా వ్యవహరించాలి. ముఖ్యమైన పనులలో శ్రమపడ్డా పనులు ముందుకు సాగవు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగాలలో మీ విలువ మరింత పెరుగుతుంది.

మిధునం: ఆత్మీయుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. ఇంటా బయట మంచి మాట తీరుతో ఆకట్టుకుంటారు. నూతనోత్సాహంతో పనులు పూర్తి చేస్తారు. వ్యాపార ఉద్యోగాలలో మీ శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది.

కర్కాటకం: ప్రముఖులతో పరిచయాలు విస్తృతం అవుతాయి. నూతన వాహన సౌఖ్యం కలుగుతుంది. కొన్ని వ్యవహారాలలో ఆకస్మికంగా నిర్ణయాలు మార్చుకుంటారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆర్థికంగా అనుకూల వాతావరణం ఉంటుంది. వ్యాపారాలు, ఉద్యోగాలలో మీ అంచనాలు నిజం కాగలవు.

సింహం: ఖర్చుల విషయంలో పునరాలోచన చేయటం మంచిది. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. గృహ వాతావరణం చికాగ్గా ఉంటుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఇంటా బయట పరిస్థితులు అనుకూలించవు. చేపట్టిన వ్యవహారాలలో ప్రతిబంధకాలు ఉంటాయి. వృత్తి, ఉద్యోగాలలో చికాకులు పెరుగుతాయి.

కన్య: ఆర్థిక వాతావరణం గందరగోళంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో కష్టపడ్డా ఫలితం ఉండదు. గృహమున కొందరి ప్రవర్తన వలన మానసిక సమస్యలు కలుగుతాయి. బంధు వర్గం వారితో వివాదాలు కలుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

తుల: ఆర్థిక ఇబ్బందులు అధిగమిస్తారు. ఒక వ్యవహారంలో అందరిని ఒక మాట మీదకు తీసుకువస్తారు. నూతన వాహన యోగం ఉన్నది. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. వ్యాపారాలు కొంత సామాన్యంగా సాగుతాయి. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

వృశ్చికం: చేపట్టిన వ్యవహారాలలో ఆటంకాలు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు తప్పవు. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారించడం మంచిది. వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికమవుతుంది.

ధనస్సు: నిరుద్యోగ శ్రమ ఫలించి నూతన అవకాశాలు లభిస్తాయి. స్థిరాస్తి క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. సంతానం విద్యా విషయాలలో శుభవార్తలు అందుకుంటారు. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి.

మకరం: ధన పరంగా ఒడిదుడుకులు అధికమవుతాయి. ఊహించని ప్రయాణాలు చేయవలసి వస్తాయి. కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడులు అధికమవుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ముఖ్యమైన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు వాయిదా పడతాయి. వృత్తి ఉద్యోగాల్లో అదనపు పనిభారం ఉంటుంది.

కుంభం: సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. వ్యాపారాలలో ఆశించిన లాభాలు అందుకుంటారు. వ్యాపారస్తులకు నూతన పెట్టుబడులు అందుతాయి. సమయానికి పనులు పూర్తి చేయగలుగుతారు. ఉద్యోగాలలో అధికారుల సహాయ సహకారాలతో నూతన అవకాశాలు అందుకుంటారు.

మీనం: భూ సంబంధిత క్రయవిక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. వ్యాపారాలలో భాగస్వామితో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. చేపట్టిన పనులలో జాప్యం కలిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో గతం కంటే మెరుగైన వాతావరణం ఉంటుంది.

# బండి సంజయ్ కొడుకుపై పోక్సో కేసు

**మొదటి పేజీ తరువాయి**

తల్లిదండ్రుల నుంచి ఒత్తిడి పెరిగిందని, దీంతో పాటు పెద్ద ఎత్తున డబ్బులు కూడా డిమాండ్ చేశారని పేర్కొన్నారు. అడిగినంతగా డబ్బులు ఇవ్వకపోతే క్రిమినల్ కేసులు పెడతామని, ఇద్దరూ శారీరకంగా కలిసినట్లు ఫిర్యాదు చేస్తామని బెదిరించారని తెలిపారు. బెదిరింపులు తట్టుకోలేక రూ.50 వేలు అమ్మాయి తండ్రికి చెల్లించానని పేర్కొన్నారు. ఈ డబ్బులతో సంతృప్తి చెందకపోగా మరో రూ.5 కోట్లు తన నుంచి డిమాండ్ చేశారని, లేదంటే ఆత్మహత్య చేసుకుంటానని అమ్మాయి తల్లి బెదిరింపులకు దిగిందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. భగీరథ్ ఇచ్చిన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న కరీంనగర్ టౌన్ పోలీసులు శుక్రవారం సాయంత్రం అమ్మాయితో పాటు ఆమె తల్లిదండ్రులపై కేసు నమోదు చేశారు.

మోదీ సభ నుంచి బండి సంజయ్ ఔట్!

ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన వేళ కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే సభకు బండి దూరమయ్యారు. బీజేపీ పెద్దలు, స్థానిక నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొనే ఈ కార్యక్రమంలో ఎంపీకి చోటు దక్కలేదు. మోదీ సభకు ఆహ్వానితుల జాబితాలో బండి పేరు లేదు. ఆయన కుమారుడు పోక్సో కేసులో ఇరుకుక్కోవడమే ప్రధాన కారణమని తెలుస్తోంది. ప్రధాని సభకు గవర్నర్ ప్రతాప్ శుక్లా, సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ సురేశ్ గోపీ, భువనగిరి ఎంపీ చామల కిరణ్



కుమార్ రెడ్డితో పాటు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని మాత్రమే ఆహ్వానించారు.

# బండి బర్తరఫ్ ఎప్పుడు?

**మొదటి పేజీ తరువాయి**

ఎందుకు విచారణ జరపడం లేదు? మైనర్ బాలికపైనే ఎదురు కేసు ఎందుకు పెట్టారు? ఉన్నావ్ కేసులో మాదిరిగా.. రాహుల్ గాంధీ హైదరాబాద్ వచ్చి బాధితురాలికి, ఆమె కుటుంబానికి అండగా నిలబడతారా? ఉన్నావ్ తరహా ఉద్యమం తెలంగాణ బాధితులకు వర్తించదా? భారతీయ జనతా పార్టీకి తెలంగాణ కాంగ్రెస్ ఒక ఫ్రాంఛైజీలా పనిచేస్తోందా? ఒక మైనర్ బాలిక గౌరవం విషయంలో కాంగ్రెస్, బీజేపీలు ఒక అపవిత్రమైన, అసహ్యకరమైన ఒప్పందానికి వచ్చాయా?' అని కేటీఆర్ రెండు జాతీయ పార్టీలను కడిగిపారేశారు. 'ఓ 17 ఏళ్ల అత్యాచార బాధితురాలు, ఆమె కుటుంబం ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేయించుకోవడానికే మూడు నెలలకు పైగా ఎందుకు పోరాడాల్సి వస్తోంది? అని కేటీఆర్ ప్రశ్నించారు. మనం ఎంతటి దుర్భరమైన, భయంకరమైన నరకంలో జీవిస్తున్నామో ఆ కుటుంబం కష్టం చూస్తే అర్థమవుతుంది అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలిని, ఆమె కుటుంబాన్ని నేరస్థుల్లా చూస్తూ ఎందుకు వేధిస్తున్నారు? ఆ మైనర్ బాలిక రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేసింది. న్యాయం కోసం వారు మూడు నెలలుగా తిరుగుతున్నారు. ఇప్పుడు మీరు ఆమెనే నిందిస్తున్నారు? ఏ నిబంధన ప్రకారం తెలంగాణ పోలీసులు ఒక మైనర్ బాలికపై హనీ-ట్రాప్, వసూళ్ల కేసు నమోదు చేశారు? మన మహిళల గౌరవం కోసం గతంలో అణచివేతదారులతో, ప్రభుత్వాలతో పోరాడాం. ఆడబిడ్డల రక్షణ కోసం అవసరమైతే మరో మిలియన్ సార్లు మళ్లీ పోరాడుతాం' అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# ఢిల్లీలో హై అలర్ట్

**మొదటి పేజీ తరువాయి**

ఢిల్లీలోని ముఖ్యమైన ప్రదేశాలను ఐఈడీలతో లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది. దాంతో ఢిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. అత్యంత సున్నితమైన రద్దగా ఉండే ప్రాంతాల్లో భద్రతా చర్యలను ముమ్మరం చేశారు. హెచ్చరిక నేపథ్యంలో, నగరంలోని పలు కీలక ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఢిల్లీ బీజేపీ రాష్ట్ర కార్యాలయం, బీజేపీ జాతీయ ప్రధాన కార్యాలయం బయట కూడా భద్రతను కట్టుదిట్టం చేశారు. మరోవైపు పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహించి, అదనపు బారికేడ్లను ఏర్పాటు చేశారు. కీలక ప్రదేశాలలో మోహరించిన భద్రతా దళాలు కూడా లక్ష్యంగా మారే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. పాకిస్తాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ ఆదేశాల మేరకు పనిచేస్తున్నాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న పాకిస్తానీ గ్యాంగ్‌స్టర్-ఉగ్రవాది షాజాద్ భట్టికి సంబంధించిన ఒక ముఠాను ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ ఛేదించిన కొన్ని వారాల తర్వాత ఈ తాజా హెచ్చరిక వెలువడింది. ఈ కేసులో తొమ్మిది మందిని అరెస్టు చేశారు. విచారణ సందర్భంగా, ఈ ముఠా సభ్యులు ఢిల్లీలో హత్యలకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ప్రాథమిక సమాచారం.

# అగ్ని ఆన్ ఫైర్

**మొదటి పేజీ తరువాయి**

విజయవంతం కావడంతో.. వ్యూహాత్మక రక్షణ సామర్థ్యాలలో మరో మెట్టు పైకెక్కినట్టయింది. డీఆర్డీవో అభివృద్ధి చేసిన క్షిపణి ఇది. దీని ద్వారా మల్టీ పేలోడ్‌లను ప్రయోగించవచ్చు. హిందూ మహాసముద్ర రీజియన్ లోని వివిధ భౌగోళిక ప్రాంతాలలో విస్తరించి ఉన్న లక్ష్యాలను ఛేదించగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి ఈ మిస్సైల్స్. ఈ ప్రయోగం.. డీఆర్డీవో చాలా కాలంగా పనిచేస్తున్న అగ్ని-6 క్షిపణి తయారీలో అడ్డంకులు తొలగిపోయినట్టయింది. అగ్ని-6 మిస్సైల్ ప్రోగ్రామ్ కోసం రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం వేచి ఉన్నామని ఇటీవలే డీఆర్డీవో చైర్‌పర్సన్ సమీర్ వీ కామత్ వెల్లడించారు.



# బెంగాల్ సీఎంగా సువేందు ప్రమాణం

**ఆ రాష్ట్ర తొలి బీజేపీ సీఎంగా రికార్డు**
**హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ**

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. మూడు దశాబ్దాలకు పైగా వామపక్షాలు, 15 ఏండ్ల పాటు టీఎంసీ నేతృత్వంలోని మమతా బెనర్జీ రాష్ట్రాన్ని పాలించగా, తొలిసారిగా బీజేపీ అధికారంలోకి వచ్చింది. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో 55 ఏండ్ల సువేందు అధికారి చేత గవర్నర్ ఆర్ఎన్ రవి 9వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయనతో పాటు బీజేపీ నేతలు దిలీప్ ఘోష్, అగ్నిమిత్ర పాల్, అశోక్ కీర్తనియా, క్షుదిరామ్ తుడు, నిషిత్ పర్మానిక్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఒకప్పుడు మమతకు సహాయకుడిగా పనిచేసిన సువేందు అధికారి ఆమె కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. తర్వాత ఆమె మేనల్లుడితో విభేదించి టీఎంసీ నుంచి బయటకు వచ్చిన ఆయన 2020లో బీజేపీలో చేరారు. తర్వాత ఆమెను నందిగ్రామ్, భవానీపూర్ లలో ముఖాముఖీ ఎన్నికల్లో రెండుసార్లు ఓడించడమే కాక, ఇప్పుడు ఏకంగా ఆమెను శాసనసభ ఎన్నికల్లో చిత్తు చేసి ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కించుకున్నారు. ఈ ప్రమాణ స్వీకారానికి ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీఏ పాలిత నేతలు, సీఎంలు హాజరయ్యారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కొద్ది గంటలకే సువేందు అధికారి రాష్ట్రంలో శాంతి భద్రతలు, సంక్షేమ పథకాల అమలును సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దుష్యంత్ నారియాలా, రాష్ట్ర డీజీపీ సిద్ధ్ నాథ్ గుప్తా, ఇతర పోలీస్ అధికారులు, ఉన్నతాధికారులతో శాంతిభద్రతలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి కోల్‌కతా పోలీస్ కమిషనర్ అజయ్ నంద్ కూడా హాజరయ్యారని తెలిసింది. గత సర్కార్ ప్రవేశపెట్టిన వివిధ పథకాల అమలు తీరుపైనా సువేందు ఆరా తీసినట్టు సమాచారం. కొత్తగా కొలువుదీరిన బీజేపీ ప్రభుత్వం వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయ పునర్వ్యవస్థీకరణపై దృష్టి సారించింది. సీఎం సువేందు అధికారి సలహాదారుగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సుబ్రతా గుప్తాను ప్రభుత్వం నియమించింది. గుప్తా ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో 'సర్'కు ప్రత్యేక ఎన్నికల పరిశీలకునిగా(ఎస్ఆర్ఓ) బాధ్యతలు నిర్వహించారు.



# విజయ ముహూర్తం

**మొదటి పేజీ తరువాయి**

ఇస్తున్న వీసీకే.. క్యాబినెట్ బెర్త్‌లు మాత్రం వద్దని చెప్పింది. 'మేం ప్రభుత్వంలో చేరబోం. వెలుపలి నుంచే మద్దతు ఇస్తాం. భవిష్యత్‌లో ప్రభుత్వంలో భాగం అవుతామా లేదా? అన్నది చెప్పలేం. రాష్ట్రపతి పాలనను నివారించేందుకు, ప్రజల తీర్పును నెరవేరేలా చేసేందుకు ప్రభుత్వ ఏర్పాటులో భాగం అవుతున్నాం' అని వీసీకే చీఫ్ తిరుమావళవన్ మీడియాకు వెల్లడించారు. తాము ఇప్పటికీ డీఎంకే నేతృత్వంలోని కూటమిలోనే ఉన్నామని వీసీకే, ఐయూఎంఎల్ వెల్లడించడం గమనార్హం. ఇప్పటికే వామపక్షాలు కూడా క్యాబినెట్ పదవులు వద్దని చెప్పిన విషయం తెలిసిందే. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో చెన్నై సమీపంలో టీవీకే ఎమ్మెల్యేలు ఉంటున్న రిసార్ట్ బయట భద్రతను భారీగా పెంచారు. ప్రస్తుతం విజయ్‌కు మద్దతు ఇస్తున్న సభ్యుల సంఖ్య 120కి చేరింది.

**పార్టీల వారీగా సంఖ్యాబలం ఇలా..**

**టీవీకే : 107, కాంగ్రెస్ : 5**

**సీపీఐ : 2, సీపీఎం : 2**

**వీసీకే : 2, ఐయూఎంఎల్: 2**

# హైదరాబాద్ పరువుపాయే!

**మొదటి పేజీ తరువాయి**

పోలీస్ అధికారి డీజీపీ భార్యను హత్య చేస్తే ఇప్పటివరకు వాళ్లను పట్టుకున్న పరిస్థితి లేదు. ఇంక జాగ్రత్తగా ఉండండి అంటూ పోలీస్ కమిషనర్ హైదరాబాద్ స్టేట్‌మెంట్ ఇస్తడు. మేమెట్లాగో జాగ్రత్తగా ఉంటాం. దానికి నువ్వు పోలీస్ కమిషనర్ ఎందుకు..? అని ప్రశ్నించారు. ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి భార్యను హత్య చేస్తే పట్టుకునే దిక్కు లేదు. కరీంనగర్ నడిబొడ్డున దోపిడీ దొంగలు బంగారం ఎత్తుకుపోతే పట్టుకునే దిక్కు లేదు. ఎమ్మెల్యేల క్యాంప్ ఆఫీస్‌ల మీద దాడి చేస్తే కనీసం ఆపే పరిస్థితి లేదు. ఒక మహిళ అర్ధరాత్రి పూట హైదరాబాద్‌లో నడిచే పరిస్థితి లేదు. కానీ బీఆర్ఎస్ నాయకుల మీద మాత్రం రాజకీయ వేధింపులకు కొదవ లేదన్నారు. కేసుల కేసులు పెట్టి అక్రమ కేసులు చేసి.. అరెస్టుల మీద అరెస్టులు చేసి జైలు నుంచి బయటకు రాకుండా చేస్తున్నారు. మహిళల రక్షణ ఫెయిలవడంలో అభివృద్ధి చూపిస్తున్నరు. మీరు హైదరాబాద్ పరువు తీసేసిన్రు. ఒకప్పుడు లా అండ్ ఆర్డర్‌లో తెలంగాణ దేశానికి దిక్సూచి. కేంద్రప్రభుత్వం తెలంగాణను అనేక సందర్భాల్లో మెచ్చుకున్నది. మహిళా పోలీస్ కమిషనర్ మంచి ప్రయత్నమే చేయొచ్చు. కానీ పరిస్థితి ఎట్లా ఉందనడానికి అది అద్దం పడుతున్నది. పరిస్థితి తీవ్రతకు కూడా అద్దం పడుతున్నది. హైదరాబాద్‌లో ఎంత దారుణమైన పరిస్థితులున్నాయన్నారు.

# రిజిస్ట్రేషన్ జల్దీ

**మొదటి పేజీ తరువాయి**

రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవసరమైతే మరింత సమయాన్ని పెంచుతామని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్లాట్ బుకింగ్‌ల సంఖ్యను కూడా పెంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇతర ప్రాంతాల్లో కూడా రిజిస్ట్రేషన్ల రద్దీ పెరిగిన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను గుర్తించి, అవసరానికి అనుగుణంగా అదనపు సమయాన్ని పెంచాలని సూచించారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ జరిగే తహసీల్దార్ కార్యాలయాలను సమన్వయం చేసుకోవాలని మంత్రి పేర్కొన్నారు.

# నేడు హైదరాబాద్‌కు మోదీ

**మొదటి పేజీ తరువాయి**

పైగా పోలీసులతో పాటు, ప్రత్యేక రక్షణ బృందాలు (ఎస్పీజీ), స్నైపర్లు, ముఫ్తీ పోలీసులు, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ రంగంలోకి దిగాయి. ప్రధాని పర్యటన, బహిరంగ సభ కారణంగా సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఈ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. ముఖ్యంగా బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి పరేడ్ గ్రౌండ్స్ వరకు వెళ్లే ప్రధాన రహదారులతో పాటూ సికింద్రాబాద్ పరిసరాల్లో వాహనాల రాకపోకలను నియంత్రించనున్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.



# బట్ట.. పొట్ట

**మొదటి పేజీ తరువాయి**

డిసెంబర్ వరకు ఈ సర్వే నిర్వహించారు. ఇందులో తెలంగాణ పురుషులలో జీర్ణక్రియ సామర్థ్యం 4.10 శాతం పడిపోయింది. ఇది దేశంలోనే అత్యధికం. జీర్ణక్రియ సరిగ్గా లేనివారిలో, ముఖ్యంగా దీర్ఘకాలిక మలబద్ధకంతో బాధపడేవారిలో జుట్టు రాలే సమస్య ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. మన జుట్టు ప్రోటీన్లతో తయారవుతుంది. మనం తిన్న ఆహారంలోని ఐరన్, జింక్, విటమిన్లను ప్రేగులు సరిగ్గా గ్రహించలేనప్పుడు, శరీరం ఆ కొరతను జుట్టుపై చూపిస్తుంది. ఫలితంగా జుట్టు బలహీనపడి రాలిపోతుంది. హైదరాబాద్ వంటి నగరాల్లో ఉపాధి, ఆర్థిక వృద్ధి బాగున్నప్పటికీ.. బిజీ లైఫ్, జంక్ ఫుడ్, పని ఒత్తిడి, వేళకు భోజనం చేయకపోవడం, తక్కువగా నీరు తాగడం వంటివి ఈ ఆరోగ్య సంక్షోభానికి దారితీస్తున్నాయి. అయితే, కేవలం పైన రాసే నూనెలు లేదా షాంపూలతో ఈ సమస్య తగ్గదని అధ్యయనం స్పష్టం చేసింది. సమస్య శరీర అంతర్భాగంలో (జీర్ణక్రియలో) ఉన్నందున, ఆహారపు అలవాట్లు మార్చుకోవడం, లోపలి నుంచి ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడం ద్వారానే జుట్టు రాలడాన్ని అరికట్టవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. త్రయ హెల్త్ సహ వ్యవస్థాపకురాలు సలోని ఆనంద్ మాట్లాడుతూ, 'తెలంగాణ గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆర్థిక ఉత్పాదకత కోసం పరుగెడుతున్న క్రమంలో పురుషులు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. జుట్టు రాలడం అనేది కేవలం సౌందర్య సమస్య కాదు, అది మీ అంతర్గత అనారోగ్యానికి ఒక హెచ్చరిక' అని హెచ్చరించారు. తెలంగాణలో మంచి జీర్ణ ఆరోగ్యం ఉన్న పురుషుల సంఖ్య 2024లో 19.13 శాతం ఉండగా, 2025 నాటికి అది 15.03 శాతానికి పడిపోయింది. ఈ 4.10 శాతం క్షీణత దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే అత్యధికం. తెలంగాణ తర్వాత రాజస్థాన్ (-3.3 శాతం), ఢిల్లీ (-2.97 శాతం) ఉన్నాయి.



ప్రపంచంలో ప్రతి మనిషి మొదట పలికే పదం 'అమ్మ'. ఆ ఒక్క పదంలోనే ప్రేమ ఉంది, త్యాగం ఉంది, ఆప్యాయత ఉంది, ఆరాధన ఉంది. మాతృదినోత్సవం అనేది కేవలం ఒక ప్రత్యేక రోజు మాత్రమే కాదు.. అమ్మ అనే మహోన్నతమైన వ్యక్తిత్వాన్ని గుర్తు చేసుకునే సందర్భం. నేటి వేగవంతమైన, యాంత్రిక జీవితంలో అమ్మ పాత్ర ఎంత గొప్పదో మరోసారి ఆలోచించాల్సిన అవసరం ఉంది.




(నేడు మాతృ దినోత్సవం)

# అమ్మ.. అనుబంధాల ఆకాశం

ఒక కుటుంబానికి అమ్మే మూలస్తంభం. ఇంటిని ఇల్లుగా మార్చేది అమ్మ ప్రేమే. పిల్లల పెంపకం నుంచి కుటుంబ బంధాలను కాపాడటంవరకు ప్రతి బాధ్యతను తన భుజాలపై మోస్తుంది. తాను అలసిపోయినా పిల్లల భవిష్యత్తు కోసం చిరునవ్వుతో నిలబడుతుంది. తన కోరికలను పక్కనపెట్టి కుటుంబ సభ్యుల సంతోషానికే ప్రాధాన్యం ఇస్తుంది. అందుకే అమ్మను భూమాతతో పోలుస్తారు. నేటి సమాజంలో మహిళల పాత్ర మరింత విస్తరించింది. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన అమ్మలు ఇప్పుడు ఉద్యోగాలు చేస్తూ, కుటుంబాన్ని కూడా సమర్థంగా నడిపిస్తున్నారు. కార్యాలయంలో బాధ్యతలు నిర్వర్తిస్తూ, ఇంటికి వచ్చాక పిల్లల చదువులు చూసుకోవడం, వృద్ధులను చూసుకోవడం, కుటుంబ అవసరాలను తీర్చడం వంటి అనేక పనులను సమర్థంగా నిర్వహిస్తున్నారు. ఈ ద్వంద్వ బాధ్యతల మధ్య ఆమె పడుతున్న మానసిక, శారీరక ఒత్తిడి ఎంతో ఎక్కువ. అయినా కుటుంబం కోసం ఆమె చూపించే అంకితభావం తగ్గడం లేదు. అయితే ఆధునిక సమాజంలో కొన్ని ఆందోళనకర మార్పులు కూడా కనిపిస్తున్నాయి. సాంకేతికత పెరిగిన కొద్దీ కుటుంబ బంధాలు బలహీనమవుతున్నాయి. వృద్ధాశ్రమాలు పెరుగుతుండటం, తల్లిదండ్రులను భారంగా భావించే మనస్తత్వం పెరగడం బాధాకరం. జీవితమంతా పిల్లల కోసం కష్టపడిన అమ్మ చివరికి ఒంటరితనంలో మిగలకూడదు. అమ్మ ప్రేమకు ప్రతిఫలం ఇవ్వలేకపోయినా కనీసం ఆమెను గౌరవించడం, ఆదరించడం ప్రతి ఒక్కరి బాధ్యత. మాతృదినోత్సవం రోజున సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం, పూలు ఇవ్వడం మాత్రమే కాదు.. అమ్మ భావాలను అర్థం చేసుకోవడం ముఖ్యం. ఆమెతో కొంత సమయం గడపడం, ఆమె ఆరోగ్యాన్ని పట్టించుకోవడం, ఆమె కష్టాలను గుర్తించడం నిజమైన కృతజ్ఞత. ఎందుకంటే అమ్మ ఉన్నంతవరకే మన జీవితానికి అర్థం ఉంటుంది. అమ్మ నీడలోనే ప్రతి మనిషి భద్రతను, ప్రేమను అనుభవిస్తాడు. అందుకే ప్రతి రోజు అమ్మకే అంకితం కావాలి. ఆమె త్యాగాన్ని గౌరవించే సమాజమే నిజమైన సాంస్కృతిక సమాజం. మాతృదినోత్సవం మనకు ఇదే సందేశాన్ని గుర్తు చేస్తోంది. 'అమ్మను ప్రేమించండి.. ఆమెను గౌరవించండి.. ఆమె విలువను గుర్తించండి'



- అలేఖ్య

# రిజిస్టర్డ్ అగ్రిమెంట్ లేకున్నా హక్కులు

## హోమ్‌బయర్లకు అండగా రేరా కీలక తీర్పు

హైదరాబాద్, మే 9 (ఈవార్తలు): హైదరాబాద్‌లో ఆలస్యమవుతున్న ఓ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ రేరా సంచలన తీర్పు వెలువరించింది. రిజిస్టర్డ్ సేల్ అగ్రిమెంట్ లేనంత మాత్రాన హోమ్‌బయర్లు తమ హక్కులను కోల్పోరని స్పష్టం చేసింది. గణనీయంగా డబ్బు చెల్లించి, ఫ్లాట్లను కేటాయించుకున్న వారు 'అలాటీ'లుగానే పరిగణించబడతారని, వారి ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత డెవలపర్‌పై ఉందని తేల్చిచెప్పింది. హైదరాబాద్ కొంపల్లిలో ఓ సంస్థ నిర్మిస్తున్న ప్రాజెక్టులో ఫ్లాట్లు కొనుగోలు చేసిన పలువురు బాధితులు రేరాను ఆశ్రయించారు. 2020-22 మధ్య ఫ్లాట్లు బుక్ చేసుకున్నామని, రెండు, మూడేళ్లలో ఇస్తామన్న డెవలపర్ ఐదేళ్లు గడిచినా నిర్మాణం పూర్తి చేయలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిర్మాణం నెమ్మదిగా సాగుతోందని, డబ్బు వాపసు అడిగినా ఇవ్వడం లేదని వాపోయారు. ఈ ఫిర్యాదులపై విచారణ సందర్భంగా డెవలపర్ తన వాదన వినిపించారు. కొందరు కొనుగోలుదారులతో అధికారికంగా సేల్ అగ్రిమెంట్లు లేనందున వారు అలాటీలు (ఫ్లాట్ అలాట్ మెంట్ పొందినవారు) కాదని పేర్కొన్నారు. మరికొన్ని ఒప్పందాలు అసంపూర్తిగా ఉన్నాయని, ఇంకొందరు



పెట్టుబడిదారులు మాత్రమేనని, ఇది సివిల్ వివాదం కిందకు వస్తుందని వాదించారు. డెవలపర్ వాదనలను తెలంగాణ రేరా తోసిపుచ్చింది. రేరా చట్టంలోని సెక్షన్ 2(ఎ) ప్రకారం, డబ్బు చెల్లించిన రసీదులు, అలాట్‌మెంట్ పత్రాలు ఉన్నందున వారంతా అలాటీలేనని స్పష్టం చేసింది. రిజిస్టర్డ్ ఒప్పందం లేకపోవడం హక్కులను నిరాకరించడానికి కారణం కాదని తేల్చిచెప్పింది. వెంటనే ప్రాజెక్టును పూర్తి చేసి, 30 రోజుల్లో దశలవారీగా నిర్మాణ షెడ్యూల్‌ను కొనుగోలుదారులకు అందించాలని ఆదేశించింది. అనుమతులు లేకుండా నిర్మించిన ఫ్లోర్లలోని వారికి 30 రోజుల్లోగా ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా ప్రత్యామ్నాయ ఫ్లాట్లు కేటాయించాలని, లేనిపక్షంలో పూర్తి డబ్బు వాపసు చేయాలని తీర్పులో పేర్కొంది. బుకింగ్ సమయంలో ఇచ్చిన 36 నెలల గడువుకు చట్టబద్ధమైన ప్రాధాన్యత ఉంటుందని రేరా నొక్కిచెప్పింది. ఈ తీర్పు, నమోదు కాని ఒప్పందాలను సాకుగా చూపి తప్పించుకోవాలనుకునే డెవలపర్లకు చెక్ పెడుతూ, హోమ్‌బయర్ల హక్కులకు మరింత బలాన్ని చేకూర్చింది.

# ఐఐటీ-పాట్నాలో హైదరాబాద్ విద్యార్థి మృతి

పాట్నా: బీహార్ లోని పాట్నా ఐఐటీ క్యాంపస్‌లో హైదరాబాద్‌కు చెందిన విద్యార్థి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. క్యాంపస్‌లో క్రికెట్ ఆడుతుండగా ప్రమాదవశాత్తు స్తంభాన్ని తాకడంతో కరెంట్ షాక్ కు గురై ప్రాణాలు విడిచాడు. మృతుడిని నగరంలోని చందానగర్‌కు చెందిన హర్షిత్ రాజ్‌గా గుర్తించారు. ఈరోజు ఉదయం ఆరు గంటలకు ఈ విషాద ఘటన చోటు చేసుకున్నట్లు ఐఐటీ పాట్నా సెక్యూరిటీ ఇన్‌ఛార్జ్ దీపక్ కుమార్ చౌరాసియా నగర పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్రికెట్ ఆడుతూ విద్యార్థి విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయినట్లు పోలీసులు తెలిపారు.

# ట్రాఫిక్ ఫ్రీ హైదరాబాద్ లక్ష్యం

## అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మే 9 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు కేవలం రోడ్ల విస్తరణ మాత్రమే సరిపోదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆధునికీకరణ, పట్టణీకరణతో భవిష్యత్తులో మరిన్ని కొత్త సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు. సచివాలయంలో నిర్వహించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే ప్రణాళికలతో ముందుకు వెళుతున్నామని అన్నారు. అండర్‌పాస్, సర్ఫేస్ ఎలివేటెడ్ అనే త్రీ లెవల్ విధానాన్ని తీసుకురావాలని అన్నారు. మల్టీ ట్రాన్స్ పోర్ట్ సిస్టంను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. క్యూర్, ప్యూర్, రేర్‌గా అభివృద్ధిని మూడు భాగాలుగా విభజించుకున్నామని అన్నారు. ఔటర్ రింగు రోడ్డు క్యూర్ ఏరియాను సర్వీస్ సెక్టార్‌గా గుర్తించామని అన్నారు. ఓఆర్‌ఆర్ బయట, ఆర్‌ఆర్‌ఆర్ లోపల ఉన్న ప్యూర్ ఏరియాను తయారీ రంగంగా, ఆర్‌ఆర్‌ఆర్ బయట ఉన్న రేర్ ఏరియాను అగ్రికల్చర్ సెక్టారుగా గుర్తించామని తెలిపారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తెలంగాణ రైజింగ్-2047 మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించుకున్నామని అన్నారు.

# బీసీలపై వివక్ష ఎందుకు?

## జనగణనలో బీసీల కాలమ్ చేర్చాలి.. కులగణన డిమాండ్‌తో వీహెచ్ దీక్ష

హైదరాబాద్, మే 9 (ఈవార్తలు): తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు బీసీ కులగణన డిమాండ్‌తో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం నాటి తెలంగాణ పర్యటనను లక్ష్యంగా చేసుకుని వీహెచ్ ఈ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీల కోసం ప్రత్యేకంగా ఒక కాలమ్‌ను చేర్చాలని, వారి జనాభా ప్రాతిపదికన న్యాయం చేయాలని వీహెచ్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేస్తున్నప్పుడు, బీసీలను ఎందుకు విస్మరిస్తున్నారని ఆయన కేంద్రాన్ని ప్రశ్నించారు. విద్యా రంగాల్లో సరైన వాటా దక్కాలని స్పష్టం చేశారు. బీసీల కులగణనపై స్పష్టమైన నిర్ణయం తీసుకున్న తర్వాతే ప్రధాని మోదీ తెలంగాణలో అడుగుపెట్టాలని ఆయన అల్టిమేటం ఇచ్చారు.

# మచ్చలేని జీవితం నాది

కరీంనగర్, మే 9 (ఈవార్తలు): తన కుమారుడు బండి భగీరథ్ మీద వస్తున్న ఆరోపణలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.ఇవన్నీ నిరాధార ఆరోపణలుగా పేర్కొన్న బండి సంజయ్.. తన ప్రజా జీవితమంతా చట్టాన్ని గౌరవించానని, ఎలాంటి మచ్చ లేకుండా జీవించానన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభ సమయంలో తనను అప్రతిష్ట పాలు జేసేందుకు కావాలని చేస్తున్న కుట్రగా పేర్కొన్నారు. 'ఇటీవల నిరాధార ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో.. నా ప్రజా జీవితమంతా చట్టాన్ని గౌరవిస్తూ, రాజ్యాంగానికి కట్టుబడి ఉన్న విషయాన్ని తెలియజేస్తున్నా. నేను ఎలాంటి మచ్చ లేకుండా జీవించా. అలాగే న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసాన్ని కలిగి ఉన్నా. పిల్లలను, కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి లాగటం.. నాతో రాజకీయంగా పోరాడేందుకు ధైర్యం లేని వారి నిస్సహాయతను తెలియజేస్తోంది. కిందిస్థాయి నుంచి వచ్చి, కార్పొరేటర్‌గా పనిచేసి, కఠోర శ్రమ, ప్రజల మద్దతుతో అంచెలంచెలుగా కేంద్ర మంత్రి అయిన ఒక బీసీ నాయకుడి ఎదుగుదలను కొన్ని శక్తులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభకు ముందు, నన్ను వ్యక్తిగతంగా అప్రతిష్టపాలు చేయడానికి ఉద్దేశించిన రాజకీయ కుట్ర ఇది అని స్పష్టంగా తెలుస్తోంది. ఏది సరైనదో, ఏది తప్పో న్యాయవ్యవస్థే నిర్ణయిస్తుందని నేను నమ్ముతున్నా. కాలమే ప్రతి ఆరోపణకు సమాధానం చెబుతుంది, ప్రతి కుట్రను బయటపెడుతుంది. సత్యమేవ జయతే..' అంటూ బండి సంజయ్ ట్వీట్ చేశారు. మరోవైపు ఓ కుటుంబం తనను హనీ ట్రాప్ చేసి.. ఐదు కోట్లు డిమాండ్ చేస్తోందంటూ బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కరీంనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలసిందే. హైదరాబాద్ కొంపల్లికి చెందిన ఓ ఫ్యామిలీ తనను బ్లాక్ మెయిల్ చేస్తోందంటూ బండి భగీరథ్ పోలీసులను ఆశ్రయించారు. అయితే ఇదే సమయంలో యువతి కుటుంబం కూడా ఫిర్యాదు చేయటం సంచలనం రేపుతోంది. భగీరథ్ యువతిని గురి చేశారంటూ ఆమె కుటుంబం హైదరాబాద్‌లో పోలీసులకు ఫిర్యాదు చేయటంతో.. ఈ విషయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.


మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!


ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.





# బెంగాల్‌లో నవోదయం

**"హే నూతన్, దేఖా దిక్ ఆర్బార్, జన్మేర్ ప్రోథమ్ శుభక్షణ్" - ఓ నూతనమా, పుట్టిన తొలి శుభ ముహూర్తాన.. నీ రూపాన్ని మరోసారి మాకు చూపించు. గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ ఈ పదాలను ఒక ఆహ్వానంగా, బెంగాల్ నిరంతర నూతన చైతన్యాన్ని ప్రతిబింబించే ప్రార్థనగా రాశారు. సంప్రదాయబద్ధంగా దీనిని ఆయన జయంతి సందర్భంగా పాడుతారు. ఇది ఆయనకు గౌరవ సూచకం మాత్రమే కాదు. జన్మదినాన్ని సూచించే ఒక కొత్త మేల్కొలుపు ఇది. పునరుజ్జీవన ఉల్లాసాన్ని వేడుక చేసుకోవటం ఇది. ఈ భూమి కేవలం మార్పును చెందటమే కాదు నిరంతరం పునర్జన్మ పొందుతుందని గురుదేవ్ గ్రహించారు. గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ 165వ జయంతికి వారం రోజుల కంటే తక్కువ సమయం ఉన్న తరుణంలో పశ్చిమ బెంగాల్ ఒక చారిత్రాత్మక మార్పునకు సాక్ష్యంగా నిలవడం ఒక శుభ పరిణామం.**



**మే 4న జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. అయితే బీజేపీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఈ ఎన్నికలు కేవలం ఒక రాజకీయ పోటీ మాత్రమే కాదు. ఇది ఈ గొప్ప భూమి కోల్పోయిన వైభవాన్ని పునరుద్ధరించే అవకాశం...**

ఎన్నికల లెక్కలకు అతీతమైన ఒక నాగరికత పిలుపు. రాజకీయ వాదోపవాదాల హోరును పక్కనపెట్టి కాస్త ఆగి, నేడు ఒక లోతైన ప్రశ్న వేసుకోవాలి. అసలైన బెంగాల్ అంటే ఏమిటి? ఆ గడ్డను పునరుద్ధరించడం అంటే అసలు అర్థం ఏమిటి? బెంగాల్ ప్రస్తుత స్థితిని అర్థం చేసుకోవాలంటే ముందుగా ఆ తల్లి గతాన్ని తరచి చూడాలి. అంటే కేవలం దశాబ్దాల క్రితం నాటిదే కాదు శతాబ్దాల నాటి చరిత్ర పరిశీలించాలి. బెంగాల్ మేధోమథనానికి మారుపేరుగా మారడానికి చాలా కాలం ముందే అదొక పుణ్యభూమి. 15వ శతాబ్దంలో నవద్వీపంలోని గంగానది తీరంలో నిమాయ్ అనే యువకుడు సంకీర్తనలు పాడటం ప్రారంభించారు. ఆయనే 'చైతన్య మహాప్రభు'గా ప్రపంచానికి సుపరిచితులు. ఆయన కీర్తన కేవలం సంగీతం మాత్రమే కాదు... అది భక్తి రూపంలో సాగిన ఒక సామాజిక సంస్కరణోద్యమం. ఆయన అస్పృశ్యులను అక్కున చేర్చుకున్నారు, పండితులతో కలిసి నర్తించారు. దైవనామం అనేది ఎటువంటి కులమత గుర్తింపులతో సంబంధం లేకుండా అందరికీ అందుబాటులో ఉంటుందని ఆయన చాటిచెప్పారు. ఆయన రగిలించిన ఈ వైష్ణవ తత్త్వమే... ఆనందదాయకమైన, అందరినీ కలుపుకుపోయే బెంగాల్, భారతీయ ఆత్మకు ఆధ్యాత్మిక ఆకృతిగా మారింది. రెండు శతాబ్దాల తర్వాత అదే ఆధ్యాత్మిక చైతన్యం 'బౌల్' సంప్రదాయం ద్వారా లౌకిక రూపాన్ని సంతరించుకుంది. ఏ కులానికి కట్టుబడని, ఏ గ్రంథాలను మోయని ఈ సంచార యోగులు 'మనేర్ మానుష్' గురించి గానం చేసేవారు. వారిలో లాలన్ ఫకీర్ అంతటి వ్యక్తి మరొకరు లేరు. ఏ మతం ఆయన్ని తమ వ్యక్తిగా చెప్పుకోలేకపోయింది. కానీ ప్రతి సంప్రదాయం ఆయన్ని అక్కున చేర్చుకుంది. ఆయన హిందువా లేక ముస్లిమా? అది ఎవరూ చెప్పలేకపోయారు. అసలు ఆ విషయం గురించి ఆలోచించాల్సిన అవసరమే కలగలేదు. ఈ సమన్వయ ప్రతిభే బెంగాలీ తత్వం... ఇది కేవలం అనుభవించాల్సిన ఒక అస్తిత్వం.



గత మూడు శతాబ్దాలలో భారతదేశ నైతిక మేల్కొలుపులో బెంగాల్ కేవలం భాగస్వామిగా మాత్రమే లేదు... ఆ ఉద్యమానికి ఒక మూలస్తంభంగా నిలిచింది. ఆనాటి పరిస్థితులను చూసిన రాజా రామ్మోహన్ రాయ్... అప్పటి సమాజం ఆచార వ్యవహారాల విషయంలో ఎంతో కఠినంగా, అవినీతిమయంగా తయారైందని గమనించారు. ఆయన సంప్రదాయాన్ని వదులుకోలేదు... అలాగని దానికి గుడ్డిగా లొంగిపోనూ లేదు. సతీసహగమన నిషేధం కోసం పోరాడటం, అంతర్గత మథనం ద్వారా ఒక మనిషి తనను తాను ఎలా పునరుద్ధరించుకోవాలో గట్టిగా చెప్పడం ద్వారా ఆయన సమాజాన్ని సంస్కరించారు. ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్ ఆ స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకెళ్లారు. విద్యను ముఖ్యంగా మహిళా విద్యను ఒక విముక్తి మార్గంగా మార్చారు. బంకిం చంద్ర ఛటోపాధ్యాయ దేశానికి మొట్టమొదటి గొప్ప నవలను అందించారు. అందులోని 'వందేమాతరం' గీతం ఒక యుద్ధ నినాదమై దశాబ్దాల పాటు స్వాతంత్ర్య సమరయోధుల గొంతుకల్లో ప్రతిధ్వనించింది. నేటికీ ప్రతి భారతీయుడి పెదవులపై అది నిలిచే ఉంది. అలాగే భారతదేశపు మొట్టమొదటి మహిళా వైద్యురాలు డాక్టర్ కాదంబినీ గంగూలీని దేశానికి అందించింది కూడా బెంగాల్ గడ్డనే. ఆమె ఎంతోమంది మహిళలను స్వయం సమృద్ధి, స్వేచ్ఛా మార్గంలో నడిపించి స్ఫూర్తినిచ్చారు. అచంచల జాతీయవాది అయిన డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ భారత ఐక్యత కోసం ప్రాణాలనే త్యాగం చేశారు.

బెంగాల్ గడ్డ జన్మనిచ్చిన అసాధారణ మేధావులు, గొప్పవారిలో స్వామి వివేకానంద అత్యంత వివేకవంతమైన, జ్ఞానోదయమైన, ఉత్తేజపరిచే శక్తిగా నిలుస్తారు. 1893లో చికాగోలో జరిగిన ప్రపంచ మత పార్లమెంటులో చారిత్రాత్మక ప్రసంగం ద్వారా ఆయన హిందూ ధర్మానికి ఉన్న గొప్పతనాన్ని ప్రపంచానికి పరిచయం చేయడమే కాకుండా మత సహనం గురించి తెలియజేయటంతో పాటు మతోన్మాదానికి

**వ్యాసకర్త**
**రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర రక్షణ శాఖ మంత్రి**

ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. ఆయన స్వదేశానికి తిరిగి వచ్చినప్పుడు వినడానికి కాస్త కఠినంగా అనిపించే ఒక నిజాన్ని దేశ ప్రజలకు చెప్పారు. సామర్థ్యం లేకుండా ఉండే ఆధ్యాత్మికత కేవలం భావోద్వేగం మాత్రమే అని, ఆకలితో ఉన్న వ్యక్తికి తత్త్వశాస్త్రం బోధించలేమని... భగవంతుడిని కేవలం దేవాలయాల్లోనే కాకుండా మహిళలు, పేదలు, స్వయంగా ఈ దేశానికి సేవలందించటం ద్వారా పూజించాలని ఆయన బోధించారు. అసలైన బెంగాల్ అంటే ఇదే. ఈ గడ్డ ఎప్పుడూ ఇలాగే ఉండేది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా బెంగాల్‌ను ఈ కోణంలోనే చూస్తారు. గతంలో ఏదోలా ఉండేది కదా అని వెనక్కి తిరిగి చూడటం కోసం కాదు లేదా మరేదో పరాయి ప్రాంతంగా మారడం కోసం అంతకన్నా కాదు. తన నాగరికత నిద్ర నుంచి బెంగాల్‌ను మేల్కొలిపి ఆ గడ్డకున్న పూర్తి సామర్థ్యాన్ని సాధించే దిశగా ముందుకు నడిపించడం కోసమే ఈ కృషి. చాలా కాలం పాటు బెంగాల్‌లోని మేధావులు, రాజకీయ వర్గాలలోని కొన్ని విభాగాలు తమ సొంత నాగరికత వారసత్వాన్ని ఒక అవమానంగా భావించాయి. దానిని వదిలించుకోవాలని లేదా ఏదో ఒక సాకుతో దాని నుంచి బయటపడాలని చూశారు. మరికొన్ని సందర్భాల్లో దాని స్థానంలో వలసవాద సిద్ధాంతాలను రుద్దడానికి ప్రయత్నించారు. దీని ఫలితంగా దశాబ్దాల పాటు అభివృద్ధి కుంటుపడింది... వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయి. ధర్మంతో పాటు బెంగాల్ బహుళత్వ ఆత్మకు విరుద్ధంగా కాకుండా దానికి పరిపూర్ణతనిచ్చే సంస్కృతి గురించి మాట్లాడే ధైర్యం చేసిన వారి గొంతుకను అణచివేశారు.

పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల వచ్చిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను కేవలం ఒక ఎన్నికల తీర్పుగా మాత్రమే చూడకూడదు. బెంగాల్‌ను దాని మూలాలు, విలువల నుంచి దూరం చేసిన వారికి వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పు ఇది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడూ అధికారం కోసం జరిగే పోరాటం కాదు. అది ఈ గడ్డ కోల్పోయిన వైభవాన్ని పునరుద్ధరించడానికి చేపట్టిన ఒక పవిత్ర ప్రయత్నం ఒక యజ్ఞం. బేలూరు మఠంతో ప్రధానమంత్రి మోదీకి ఉన్న ప్రగాఢ అనుబంధం, స్వామి వివేకానంద పట్ల ఆయనకున్న భక్తిశ్రద్ధలు, సుపరిపాలనను 'సేవ'గా అంటే ఒక ఆరాధనా రూపంగా అభివర్ణించే ఆయన విధానం... ఇవేవీ కేవలం రాజకీయ ప్రకటనలు కావు. ఇవి బెంగాల్ గత వైభవాన్ని తిరిగి పొందేందుకు... సురక్షితమైన, అద్భుతమైన భవిష్యత్తు వైపు సాగిపోయేందుకు అవసరమైన ప్రేరణను అందిస్తాయి. ఇవి ఒక 'ప్రధాన సేవకుడు' తన 'ప్రధాన ధర్మాన్ని' నిర్వర్తించడానికి ఒక నిదర్శనంగా నిలుస్తాయి. బెంగాల్‌ను పునరుద్ధరించడం అంటే చైతన్య మహాప్రభు సంకీర్తనలు పాడిన ఆ గంగానది ఘాట్‌ల వెంబడి ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను నిర్మించడం. ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్ కలలుగన్న పాఠశాలలకు నిధులు సమకూర్చడం. శతాబ్దాల పాటు భారతదేశ విద్యారంగానికి నాయకత్వం వహించిన ఈ గడ్డపై అత్యున్నత స్థాయి విశ్వవిద్యాలయాలను నిర్మించడం. పశ్చిమ బెంగాల్‌లోని గిరిజన సోదర సోదరీమణులందరికీ ఆత్మగౌరవాన్ని అందించడం. బెంగాల్‌ను పాలించిన పార్టీల చేతిలో సుదీర్ఘకాలంగా సవతి తల్లి ప్రేమకు గురై ఇబ్బందులు పడుతున్న కొండ ప్రాంతాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా స్పందించడం. హే నూతన్.. ఓ కొత్తదనమా.. మరోసారి నీ దర్శనాన్ని మాకు ప్రసాదించు. ప్రధాని మోదీ మార్గదర్శకత్వం, బెంగాల్ బిడ్డలందరి ఆశీస్సులతో ఏర్పడిన బెంగాల్‌లోని మొట్టమొదటి బీజేపీ ప్రభుత్వం ఇప్పటి నుంచి ఆ ప్రార్థనతోనే తన 'సేవా'స్ఫూర్తిని కొనసాగిస్తుంది. గత అరవై ఏళ్లలో ఒకానొక సమయంలో బెంగాల్ స్వర్ణయుగం ముగిసిపోయిందేమో అనిపించింది. కానీ నేడు ఆ గడ్డ పునర్జన్మ పొందింది. ముమ్మందు రాబోయే శ్రేయస్సు, శాంతి, శక్తిమంతమైన నవజీవన వాగ్దానంతో బెంగాల్ సరికొత్తగా వెలుగొందుతోంది.

## గోవాలో విదేశీయులే డేంజర్

**అధికంగా నిందితులు వాళ్లే.. 2022-24 మధ్య 206 కేసుల్లో ఫారినర్స్**



పనాజీ: ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన గోవాలో మరో చీకటి కోణం వెలుగులోకి వచ్చింది. ఇక్కడ విదేశీయులపై జరిగే నేరాల కన్నా, వారే స్వయంగా పాల్పడే నేరాలు చాలా ఎక్కువగా ఉన్నాయని జాతీయ నేర గణాంక సంస్థ (ఎన్సీఆర్బీ) డేటా స్పష్టం చేస్తోంది. 2022 నుంచి 2024 మధ్య కాలంలో విదేశీయులు బాధితులుగా ఉన్న కేసులతో పోలిస్తే, వారు నిందితులుగా ఉన్న కేసులు ఏకంగా ఆరు రెట్లు అధికంగా నమోదయ్యాయి. ఈ గణాంకాలు గోవాలో పెరుగుతున్న నేరాల ధోరణిని సూచిస్తున్నాయి. ఎన్సీఆర్బీ డేటా ప్రకారం, గత మూడేళ్లలో గోవా పోలీసులు విదేశీయులకు సంబంధించి మొత్తం 251 కేసులు నమోదు చేశారు. వీటిలో ఆశ్చర్యకరంగా 206 కేసుల్లో విదేశీయులే నిందితులుగా ఉన్నారు. కేవలం 45 కేసుల్లో మాత్రమే వారు బాధితులుగా ఉన్నారు. ముఖ్యంగా 2024లో విదేశీయులు చేసిన నేరాలు 27 శాతం పెరిగాయి. హత్యాయత్నం, అత్యాచారం, మోసం, దాడులతో పాటు ఫారినర్స్ యాక్ట్ ఉల్లంఘన, మాదకద్రవ్యాల అమ్మకం, రవాణా వంటి తీవ్రమైన నేరాల్లో వారి ప్రమేయం ఉన్నట్లు తేలింది. ఈ నేరాలకు సంబంధించి నైజీరియా, రష్యా, నేపాల్, టాంజానియా, బల్గేరియా, బంగ్లాదేశ్ వంటి దేశాల పౌరులను గోవా పోలీసులు అరెస్ట్ చేశారు. ఎక్కువగా వీసా గడువు ముగిసినా అక్రమంగా నివసించడం, డ్రగ్స్ వ్యాపారం వంటి కార్యకలాపాల్లో పట్టుబడుతున్నారు. ఈ నేపథ్యంలో గోవా ప్రభుత్వం చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే విదేశీయుల కోసం మపుసాలో ప్రత్యేక డిటెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని, శిక్షాకాలం పూర్తయ్యాక ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ) ద్వారా వారిని వెనక్కి పంపిస్తామని అధికారులు తెలిపారు.

## చిక్కుల్లో అంబానీ 'వంతారా' జూ

**వన్యప్రాణుల అక్రమ రవాణా కేసులో వంతారా జూ పేరు**

ముంబై: రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీకి చెందిన గుజరాత్‌లోని ప్రతిష్ఠాత్మక 'వంతారా' జూ అంతర్జాతీయ వివాదంలో చిక్కుకుంది. అంతరించిపోతున్న వన్యప్రాణుల అక్రమ రవాణాకు సంబంధించిన ఒక కేసులో వంతారా జూ పేరు వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో సంబంధాలున్నాయన్న అనుమానంతో ప్రముఖ అమెరికన్ పక్షి నిపుణుడు టోనీ సిల్వాను బ్రెజిల్ ఫెడరల్ పోలీసులు విచారిస్తున్నారు. మే 1న సావో పాలోలోని గువారుల్హోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో టోనీ సిల్వా నుంచి మూడు సెల్‌ఫోన్లు, ఒక కంప్యూటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అంతరించిపోతున్న గోల్డెన్ లయన్ టామరిన్స్ (ప్రత్యేకమైన కోతులు), లియర్స్ మకావ్ (పక్షులు) వంటి బ్రెజిలియన్ జాతులను వంతారా జూ కోసం అక్రమంగా కొనుగోలు చేయడానికి సిల్వా సమన్వయం చేశారని పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, ఈ ఆరోపణలను వంతారా యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. టోనీ సిల్వా తమ ఉద్యోగి కాదని, ఒక స్వతంత్ర కాంట్రాక్టర్ ద్వారా జంతువుల పోషణ, ఎన్‌క్లోజర్ డిజైన్ వంటి పరిమిత కన్సల్టెన్సీ సేవలు మాత్రమే అందించారని స్పష్టం చేసింది. అతని వ్యక్తిగత ప్రయాణాలతో తమకు ఎలాంటి సంబంధం లేదని, బ్రెజిల్ పర్యటన గురించి తమకు తెలియదని ఒక ప్రకటనలో పేర్కొంది. టోనీ సిల్వాకు వన్యప్రాణుల అక్రమ రవాణాలో నేర చరిత్ర ఉంది. 1996లో అరుదైన పక్షులను అక్రమంగా తరలించిన కేసులో అతనికి ఏడేళ్ల జైలు శిక్ష పడింది. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రానిక్ పరికరాలను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపిన పోలీసులు, ఈ కేసులో అంతర్జాతీయ ముఠాల ప్రమేయంపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఆరోపణలపై టోనీ సిల్వా ఇంకా స్పందించలేదు.

## కాంగ్రెస్ అంటే ఏంటో తెలిసింది

**ఒక్క రోజులోనే బంధం తెంచుకుంది.. డీఎంకే చీఫ్ స్టాలిన్ ఆవేదన**



చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత నెలకొన్న రాజకీయ అనిశ్చితిపై డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ స్పందించారు. ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో, తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించిన నేపథ్యంలో ఆయన ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఒక్క రోజులోనే డీఎంకేతో బంధాన్ని తెంచుకుని కాంగ్రెస్ పార్టీ వెళ్లిపోయిందని ఆవేదన వెలిబుచ్చారు. కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో స్పందించారు. "నా ప్రాణంలో ప్రాణంగా కలిసిపోయిన ప్రియమైన సోదరులకు, నా ప్రాణ సమానులైన తమిళ ప్రజలకు నా ప్రేమపూర్వక నమస్కారాలు. ఎన్నికల ఫలితాలు ప్రకటించబడిన తర్వాత జరుగుతున్న పరిణామాలను మీరు చూస్తూనే ఉన్నారు. ఏ పార్టీకి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అవసరమైన మెజారిటీ రాని విధంగా శాసనసభ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసే స్థాయిలో ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే) నేతృత్వంలోని లౌకిక ప్రగతిశీల కూటమికి సీట్లు రానప్పటికీ, మనం చెప్పుకోదగ్గ ఓట్లను సాధించాం. కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు తాము అడ్డంకిగా ఉండబోమని, డీఎంకే నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తుందని నేను ఇదివరకే మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పాను. ఆ తర్వాత, నా అధ్యక్షతన జరిగిన శాసనసభ్యుల సమావేశంలో, తుది నిర్ణయం తీసుకునే బాధ్యతను నాకే అప్పగించారు. "పార్టీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, పార్టీ ముఖ్య నేతలతో చర్చించి నిర్ణయం తీసుకుంటాను" అని ఆ సమావేశంలో వారికి తెలిపాను. ప్రభుత్వం ఏర్పాటుకు ఎవరికీ మెజారిటీ రాని ఈ పరిస్థితుల్లో, చాలా మంది ప్రత్యామ్నాయ ఆలోచనలు చెప్పారు. నా వరకు, మిత్రపక్షాలు ఏ నిర్ణయం తీసుకున్నా వారి నిర్ణయాన్ని గౌరవించి, సమన్వయంతో పనిచేసి, స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి. మరో ఎన్నికలకు దారితీయకూడదన్నదే నా అభిప్రాయం. ప్రస్తుత సంక్షోభాన్ని నివారించేందుకు, మేము తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి మద్దతు ఇస్తున్నప్పటికీ, విధానపరంగా డీఎంకే నేతృత్వంలోని లౌకిక ప్రగతిశీల కూటమిలోనే కొనసాగుతాం" అని మా కూటమిలోని మిత్రపక్షాలు ప్రకటించడాన్ని నేను స్వాగతిస్తున్నాను. కూటమి తరఫున పోటీ చేసి గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు తెలిపేందుకు అన్నా అరివాలయంకు రాలేదు. ఒకే రోజులో డీఎంకేతో బంధాన్ని తెంచుకుని కాంగ్రెస్ పార్టీ వెళ్లిపోయింది. అదే సమయంలో, కమ్యూనిస్ట్ నాయకులు, కామ్రేడ్ షణ్ముగం, కామ్రేడ్ వీరపాండియన్, విదుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే) అధ్యక్షుడు తిరుమావళవన్ "తమిళనాడు హక్కుల కోసం, ప్రజల సంక్షేమం కోసం డీఎంకేతో కలిసి పోరాడతాం" అని ప్రకటించి స్నేహ భావాన్ని ప్రదర్శించారు. ఇది విధానాలలో బలంగా ఉన్న డీఎంకేపై వారికి ఉన్న నమ్మకాన్ని చూపుతుంది. ఈ అత్యంత కీలకమైన, క్లిష్ట సమయంలో మా వెంట నిలిచిన మిత్రపక్ష నేతలు ప్రొఫెసర్ అయ్య కాదర్ మొహిదీన్, అన్న వైగో, సోదరి ప్రేమలత విజయకాంత్, ప్రొఫెసర్ జవాహిరుల్లా, సోదరులు ఈశ్వరన్, తమీమున్ అన్సారీతో సహా అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. వారి నిబద్ధతకు ఎలాంటి కృతజ్ఞతలు, ప్రశంసలు అయినా సరిపోతాయి. గత ఐదేళ్లలో తమిళనాడును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, రాష్ట్రాన్ని సుసంపన్నం చేశాం. ఎన్నో పథకాల ద్వారా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చేలా చేశాం. దూరదృష్టి, ప్రణాళికతో కూడిన ఆ పథకాలను ఏర్పడబోయే కొత్త ప్రభుత్వం కూడా కొనసాగించాలన్నది నా వ్యక్తిగత అభిప్రాయం. మహిళలు, యువత, విద్యార్థులు, పిల్లలు, అణగారిన వర్గాలు, ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఉద్దేశించిన అన్ని పథకాలను కొనసాగిస్తే ప్రజలకు మేలు జరుగుతుంది, రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని కొత్త ప్రభుత్వం పనిచేయాలని కోరుకుంటున్నాను. ఏర్పడబోయే కొత్త ప్రభుత్వానికి మరోసారి నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను" అంటూ స్టాలిన్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

## అనిల్ కార్యాలయాల్లో సీబీఐ సోదాలు



ముంబై: రిలయన్స్ అనిల్ ధీరూబాయ్ అంబానీ గ్రూప్ అధినేత అనిల్ అంబానీకి చెందిన కార్యాలయాల్లో సీబీఐ సోదాలు నిర్వహిస్తోంది. అనిల్ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్ కంపెనీలైన రిలయన్స్ టెలికాం లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌లపై నమోదైన కేసులకు సంబంధించి ఈ సోదాలు జరిగినట్లు తెలుస్తోంది. బ్యాంకు మోసం కేసులో ముంబైలో అనిల్ అంబానీకి సంబంధించిన 17 ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించినట్లు సీబీఐ తెలిపింది. కంపెనీల డైరెక్టర్ల నివాసాలు, మధ్యవర్తిత్వం వహించిన సంస్థల కార్యాలయాల్లో కూడా సోదాలు జరుపుతున్నట్లు సీబీఐ అధికారులు తెలిపారు. ఒకే చిరునామా నుంచి పలు మధ్యవర్తి కంపెనీలు పనిచేస్తున్నట్లు గుర్తించామని, దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. వేల కోట్ల రూపాయల మోసాలకు పాల్పడినట్లు ప్రభుత్వరంగ బ్యాంకులు, ఎల్ఐసీ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్‌పై ఏడు కేసులు నమోదయ్యాయి.

## కొత్త సీడీఎస్‌గా రాజా సుబ్రమణి

న్యూఢిల్లీ: భారత రక్షణ దళాల్లో రెండు అత్యంత కీలకమైన నియామకాలు జరిగాయి. దేశ నూతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)గా లెఫ్టినెంట్ జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణిని కేంద్ర ప్రభుత్వం నియమించింది. అలాగే, నౌకాదళానికి నూతన అధిపతిగా వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్‌ను ఎంపిక చేసింది. ప్రస్తుత సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ మే 30న పదవీ విరమణ చేయనుండగా, ఆయన స్థానంలో సుబ్రమణి బాధ్యతలు చేపడతారు. ఈయన సీడీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు భారత ప్రభుత్వ సైనిక వ్యవహారాల విభాగం కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తారు. ఇక, నేవీ చీఫ్ వైస్ అడ్మిరల్ దినేశ్ కుమార్ త్రిపాఠి మే 31న పదవీ విరమణ చేయనుండటంతో కృష్ణ స్వామినాథన్ ఆ పదవిని అలంకరించనున్నారు.

## బెంగాల్ ప్రజలకు మోదీ సాష్టాంగ నమస్కారం

**సీఎంగా సువేందు ప్రమాణం అనంతరం ఘటన**

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి అపూర్వ విజయాన్ని కట్టబెట్టిన ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ వినమ్రంగా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం, సువేందు అధికారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం చారిత్రక ఘట్టం. ఈ సందర్భంగా వేదికపై నుంచి ప్రజలకు అభివాదం చేసిన ప్రధాని, ఆ తర్వాత సాష్టాంగ నమస్కారం చేశారు. ఈ దృశ్యం కార్యక్రమానికి హాజరైన వారిని విశేషంగా ఆకట్టుకుంది. కోల్‌కతాలోని ప్రఖ్యాత బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ ప్రమాణ స్వీకార మహోత్సవం అట్టహాసంగా జరిగింది. గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి సువేందు అధికారితో పాటు మరో ఐదుగురు మంత్రులతో ప్రమాణం చేయించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మొత్తం 294 స్థానాలున్న అసెంబ్లీలో బీజేపీ 207 సీట్లు గెలుచుకుని, 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ పాలనకు ముగింపు పలికింది. ఈ విజయం బీజేపీకి ఎంత ముఖ్యమో చెప్పడానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ కార్యక్రమానికి స్వయంగా హాజరు కావడమే నిదర్శనం. ఎన్నికలకు ముందు వీరిద్దరూ బెంగాల్‌లో విస్తృతంగా పర్యటించి, భారీ రోడ్‌షోలు, ర్యాలీలతో ప్రచారం నిర్వహించిన విషయం తెలిసిందే. వారి కృషి ఫలించి, బెంగాల్ రాజకీయ చరిత్రలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. సువేందు అధికారి నేతృత్వంలోని తొలి మంత్రివర్గంలో సామాజిక సమతుల్యతకు బీజేపీ పెద్దపీట వేసినట్లు కనిపిస్తోంది. ప్రమాణ స్వీకారం చేసిన వారిలో దిలీప్ ఘోష్ (ఓబీసీ), అగ్నిమిత్ర పాల్ (కాయస్థ), అశోక్ కిర్తానియా (మథువ), క్షుదీరామ్ తుడు (గిరిజన తెగ), నిషిత్ ప్రామాణిక్ (రాజ్‌బొంగ్షి) వంటి వివిధ వర్గాల వారికి ప్రాతినిధ్యం కల్పించారు. పార్టీ బలోపేతానికి, చారిత్రక విజయానికి కృషి చేసిన ఈ నేతలకు మంత్రివర్గంలో చోటు కల్పించడం ద్వారా పార్టీ వారికి సరైన గుర్తింపునిచ్చింది.



## కేంద్రాన్ని ప్రశ్నించరేం?

**బీజేపీ, బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ విమర్శలు**

జగిత్యాల, మే 9 (ఈవార్తలు): రైతుల సమస్యల విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని కాంగ్రెస్ నాయకుడు ముకేశ్ ఖన్నా అన్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై స్పందించకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆన్‌లైన్ విధానం, జీపీఆర్ఎస్ వంటి సాంకేతిక సమస్యల కారణంగా ధాన్యం కొనుగోళ్లు 15 రోజుల ఆలస్యంగా ప్రారంభమయ్యాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు కోరినా మొక్కజొన్న, జొన్న పంటలను పీఎస్ఎస్ పరిధిలోకి తీసుకుని కొనుగోలు చేయడంలో కేంద్రం స్పందించలేదన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం రైతుల నుంచి మొక్కజొన్న కొనుగోలు చేస్తోందని పేర్కొన్నారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యం, మొక్కజొన్నలను కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించి కేవలం 25 శాతం మాత్రమే సేకరించాలని నిబంధనలు పెట్టడం రైతులకు అన్యాయమన్నారు. ఎఫ్‌సీఐ ద్వారా ధాన్యం కొనుగోలు చేసినట్లే మొక్కజొన్నలను కూడా కేంద్రం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని, 25 శాతం పరిమితిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతుల ఖాతాల్లోకి 69.54 కోట్లు

**జగిత్యాల జిల్లాలో వేగంగా వరి ధాన్య కొనుగోళ్లు**

**కలెక్టర్ సత్యప్రసాద్ వెల్లడి**

జగిత్యాల, మే 9 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో వరి ధాన్య కొనుగోళ్లు సాఫీగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ వేగంగా జరుగుతోందన్నారు. రైతులు తీసుకొస్తున్న ధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా కొనుగోలు చేసి వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. లారీలు, ట్రాక్టర్ల ద్వారా ధాన్యాన్ని త్వరితగతిన తరలిస్తూ కొనుగోలు కేంద్రాల్లో నిల్వలు పేరుకుపోకుండా పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు ఇబ్బందులు పడకుండా టార్పాలిన్లు, అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 88,156 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ధాన్యం విక్రయించిన 4,070 మంది రైతుల ఖాతాల్లో రూ. 69.54 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. రైతులకు చెల్లింపులు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని, రైతులు ధాన్యం విక్రయానికి సంబంధించి సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.



## వెంకన్న సేవలో దావ వసంత

జగిత్యాల రూరల్, మే 9 (ఈవార్తలు): జగిత్యాల మండలంలోని అల్లీపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర స్వామివారి కళ్యాణోత్సవాల్లో జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ పాల్గొన్నారు. నాయకులతో కలిసి ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆమెకు స్వాగతం పలికారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ రాజలింగం, బీఆర్ఎస్ నాయకులు బర్కాం మల్లేష్, రత్నాకర్ రావు, అన్నదాన ట్రస్ట్ అధ్యక్షుడు మంద రవి, మాజీ సర్పంచ్ గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ మోర విజయలక్ష్మి వెంకటేష్, ముదాం శ్రీను, ఎంబరి రాజారెడ్డి, అత్తినేని సాయి రెడ్డి, ఎంబరి కమలాకర్, నాయిని గంగారెడ్డి, పోతు శ్రీను, ఎంబరి సురేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ప్రజల భద్రతకు 16 సీసీ కెమెరాలు

మేడిపెల్లి, మే 9 (ఈవార్తలు): నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపులో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని మెట్‌పల్లి డీఎస్పీ రాములు అన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పోరుమల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామ భద్రతలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. నేరాల నివారణ, అనుమానాస్పద కార్యకలాపాల గుర్తింపు, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడంలో ఇవి సమర్థవంతంగా పనిచేస్తాయని పేర్కొన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పోలీసులకు ప్రజల సహకారం ఉంటేనే శాంతిభద్రతలు మరింత బలపడతాయని తెలిపారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. యువత గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ శ్రీధర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డులో రైతుల కష్టాలు

## బీఆర్ఎస్ నేతల మెట్‌పల్లి మార్కెట్ యార్డు పరిశీలన

మెట్‌పల్లి, మే 9 (ఈవార్తలు): ఇటీవల కురిసిన అకాల వర్షాలతో తడిసిన వరి ధాన్యం, మక్కలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శనివారం మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. మార్కెట్ యార్డు మొత్తం మక్కలు, వడ్లతో నిండిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నేతలు అడిషనల్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని ప్రత్యేకంగా పరిశీలించి రైతులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని, మార్కెట్ యార్డులో టార్పాలిన్ల సౌకర్యం పెంచాలని అధికారులకు సూచించారు. రైతులు పండించిన పంటను వెంటనే కొనుగోలు చేసి వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



**తడిసిన మక్కలపై జీవన్ రెడ్డి ఆందోళన**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీట్ మార్కెట్‌లో అకాల వర్షాలకు తడిసిన మక్కలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి పరిశీలించారు. మార్కెట్‌లో మక్కలు తడుస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. లారీలు సమయానికి రాకపోవడంతో తూకం వేసిన మక్కల సంచులు కూడా వర్షానికి తడుస్తున్నాయని రైతులు జీవన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన జిల్లా కలెక్టర్, మార్క్‌ఫెడ్ ఎండీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. మార్కెట్‌లో ఖాళీగా ఉన్న మూడు గోదాముల్లో కనీసం ఒక గోదామును మక్కల నిల్వ కోసం కేటాయించాలని కోరారు. గోదాములు సాధ్యం కాకపోతే నెట్టింగ్ ఏర్పాటు చేసి మక్కలు తడవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంపై స్పందించిన అధికారులు వెంటనే లారీలు అందుబాటులోకి తెచ్చి మక్కల తరలింపును ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.



## ధాన్యం చివరి గింజ వరకు కొంటాం

**ప్రతిపక్షాల మాటలు నమ్మి ఆందోళన పడొద్దు**

**తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తాం.. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

గంగాధర, మే 9 (ఈవార్తలు): చొప్పదండి నియోజకవర్గం లోని కొనుగోలు కేంద్రాలకు దాన్యం తీసుకువచ్చిన రైతులు ఆందోళనకు గురికా వద్దని, రైతుల తీసుకువచ్చిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా ఇచ్చారు. గంగాధర మండలం మధురానగర్ లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోళ్ల తీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన జిపిఎస్ సిస్టంతో ధాన్యం కొనుగోలు వారం రోజులు ఆలస్యం అయినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని కొనుగోలు కేంద్రాలపై నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులతో మాట్లాడి రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొన్ని కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ తూకం వేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, నిబంధన మేరకే ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి లారీలను పంపించాలని కలెక్టర్ను కోరారు. కొనుగోలు చేసిన ధాన్యం తీసుకోకుండా మిల్లర్లు ఇబ్బంది పెడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వేముల భాస్కర్,పడాల రాజన్న,తూం రాజు వేముల అంజి, సాగి అజయ్ రావు,మంత్రి మహేందర్,దాతు అంజి తదితరులు పాల్గొన్నారు.

## బైరి చందన్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

మల్యాల, మే 9 (ఈవార్తలు): మల్యాల మండల పరిధిలో త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో బైరి చందన్ కుమార్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు, క్రీడాభిమానులు భారీగా హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న పోలీస్ అధికారులు మరియు గ్రామ పెద్దలు టోర్నమెంట్‌ను ప్రారంభించి ఆటగాళ్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని, క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. గ్రామీణ స్థాయిలో క్రికెట్‌కు ప్రోత్సాహం అందించేందుకు ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. వివిధ గ్రామాల నుంచి జట్లు పాల్గొని ఉత్సాహంగా మ్యాచ్‌లు ఆడుతున్నాయి. కార్యక్రమంలో త్రిశూల్ యూత్ సభ్యులు, స్థానిక నాయకులు, క్రీడాకారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు ఇట్టి టోర్నమెంట్ కు గుడి పేట గ్రామంలో శ్రీ సీతారామ ప్లే గ్రౌండ్ ని తయారుచేసి మల్యాల మండలం క్రీడాకారులకు క్రికెట్ ఆడుకోవడానికి అందుబాటులోకి తీసుకొచ్చిన గుడిపేట కమిటీ మెంబర్లకు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.



## బల్వంతాపూర్‌లో రామాలయానికి శంకుస్థాపన

మల్యాల, మే 9 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం బల్వంతాపూర్ గ్రామ శివారులో నిర్మించనున్న రామాలయానికి శనివారం శంకుస్థాపన చేశారు. అర్చకుడు కనపర్తి అనిల్ శాస్త్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం గొప్పగా సాగింది. విశ్వేశ్వర సహిత సీతారామాలయ దేవాలయ నిర్మాణం కోసం దాతల నుంచి విగ్రహాలు, దేవాలయ సామగ్రి అందనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యాల రాంలింగారెడ్డి, దొమ్మాటి రాజేందర్, పులుగు తిరుపతి రెడ్డి పత్తిపాక లక్ష్మీరాజం, ఈగల్ యూత్ సభ్యులు, హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ సభ్యులు, సర్పంచ్, ప్రజాప్రతినిధులు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మాటేసి.. గంజాయి ముఠాను పట్టేసి..!

**చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు**

కోరుట్ల, మే 9 (ఈవార్తలు): అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. మెట్‌పల్లి డీఎస్పీ రాములు తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్లకు చెందిన ఎండీ యాసిర్ నూమాన్ (30), కొత్తూరి సిద్ధార్థ (24) నాందేడ్ నుంచి కోరుట్లకు గంజాయిని తరలిస్తుండగా, సమాచారం అందుకున్న ఎస్సై చిరంజీవి నేతృత్వంలోని బృందం శనివారం కోరుట్ల శివారులోని వెటర్నరీ కాలేజీ ముందు తనిఖీలు చేపట్టింది. ఇందులో భాగంగా టీఎస్ 21 బీ 653 నంబరు కారులోని డ్యాష్ బోర్డులో గంజాయి దొరికింది. వీరు మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన షేక్ ముజాయిద్ వద్ద గంజాయి కొని, కోరుట్ల పరిసర ప్రాంత యువతకు అమ్ముతున్నట్లు గుర్తించారు. వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నట్లు తేలింది. 1 కిలో గంజాయి, కారును స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేశారు. మరో నిందితుడు నాందేడ్‌కు చెందిన ముజాయిద్ పరారీలో ఉన్నాడు. గంజాయి ముఠాను పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్సై చిరంజీవి, హెడ్ కానిస్టేబుల్ అశోక్, రాహుల్ సాగర్, రాజేశ్వర్‌ను ఎస్పీ అశోక్ కుమార్, మెట్‌పల్లి డీఎస్పీ రాములు అభినందించారు.

# రాజకీయాల్లో ఎదగాలనుకునేవారికి 'పవర్ ప్లే'

**రాజకీయ వ్యూహకర్త రమాకాంత్ రావినూతల వెల్లడి**

సుల్తాన్‌బజార్,మే 9 (ఈవార్తలు): బూత్ స్థాయి కార్యకర్తల నుంచి రాష్ట్ర స్థాయి నాయకుల వరకు రాజకీయాల్లో ఎదగాలని ఆకాక్షించే వారికి పవర్ ప్లే పుస్తకం ఎంతగానో దోహదం చేస్తుందని రాజకీయ వ్యూహకర్త,రచయిత రమాకాంత్ రావినూతల పేర్కొన్నారు.ఈ మేరకు శనివారం రెడ్‌హిల్స్ ఎఫ్‌టీసీసీఐలోని సురానా ఆడిటోరియంలో ఆయన రచించిన ప్రజల నుం చి పీఠం వరకు అనే నినాదంతో పవర్ ప్లే పుస్తకాన్ని కంటెంట్ పర్యవేక్షకులు, మోటివేషనల్ స్పీకర్ శ్రీపాదరామ్ మదు నూరితో కలిసి ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లా డుతూ జెండా మోసే కార్యకర్తలు రాజకీయంలో ఎదగలేక రాజకీయాల నుండి తప్పుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.బూత్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఎదగాలనే ఉద్దేశ్యంతో దేశంలో ఇప్పటి వరకు ఎవ్వరూ రచించని పుస్తకాన్ని తొలిసారి నాయకత్వాన్ని నిలబెట్టే మూడు స్థంభాలు ఇన్నర్ సర్కిల్, మెం టర్,కార్యకర్తలు పూర్తి స్థాయి వివరణతో పవర్ ప్లే పుస్తకాన్ని రూపొందించడం జరిగింద ని అన్నారు.గత 15 సంవత్సరాలుగా ఎన్నికల రాజకీయాల్లో,సుమారు 60 అసెంబ్లీ,9 పార్లమెంట్ నిజయోజకవర్గాల్లో వ్యూహకర్త గా పని చేసి అనేక అభ్యర్థుల విజయాల్లో తన వంతు పాత్ర పోషించిన అనుభవంతో 16 పుస్తకాలను రచించ డం జరిగిందని అన్నారు.రాజకీయ వ్యూహం,ఎన్నికల ప్రచారాలు, నాయకత్వం వంటి విభాగాల్లో అత్యధిక పు స్తకాలు రాసిన ఏకైక రచయితగా భారతదేశంలో గుర్తింపు పొందడం విశేషం.రాజకీయాల్లో వ్యూహకర్తగా ఎద గాలనే ఆకాంక్ష ఉన్న వారికి ఈ పుస్తకాలు మార్గద ర్శకాలుగా నిలుస్తాయని అన్నారు.కంటెంట్ పర్యవేక్షకులు, మోటివేషనల్ స్పీకర్ శ్రీ పాదరామ్ మదునూరి మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాల్లోకి యువత అడుగు పెట్టా ల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.విఫలం అనేది అంతం కాదని,అది కొత్త ఆరంభానికి అవకాశం అనేది తన నమ్మకమని అన్నారు.రాజకీయ రం గంలోనూ,వ్యాపార రంగంలోనూ,వ్యక్తిగత జీవితాల్లోనూ వేలా ది మందిని ప్రేరేపించిందని అన్నారు.రచయిత రమా కాంత్ రావినూతల రచించిన పవర్ ప్లే పుస్తకంతో కార్య కర్తల నుండి రాజకీయ నాయకులుగా ఎదగేందుకు ఎంతగానో తోడ్పాటును అందిస్తుందని అన్నారు. చదువులేని వారు రాజకీయాల్లో ఏలుతున్నారని, గ్రాడ్యుయేట్స్ అయిన వారు రాజకీయాల్లోకి రావాల్సిన సమ యం ఆసన్నైమెందని అన్నారు.సమాచార సాంకేతిక రంగంలో దశాబ్దం పాటు అను భవనం కలిగిన తాను రేటి యువత రాజకీయాల్లో ఎదిగేందుకు ఆసక్తి ఉంటే శిక్షణ ఇస్తానని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో నికీలు గుండా,సీఎల్ చంద్రశేఖర్,కుమార్,రామ్ కళ్యాణ్,కిశోర్ తదితరులు పాల్గొన్నారు.





## అంజన్న జన్మోత్సవాలకు అంకురార్పణ

మల్యాల, మే 9 (ఈవార్తలు): కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో నిర్వహించనున్న పెద్ద జయంతి ఉత్సవాల సందర్భంగా ఈరోజు సాయంత్రం 6 గంటల 30 నిమిషాలకు యాగశాల శుద్ధి, పుణ్యాహవచనం, అంకురార్పణ, అఖండ దీపస్థాపన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలకు శుభారంభం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్ అంజనారెడ్డి, స్థానాచారి కపిందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, సునీల్, టెంపుల్ ఇన్స్పెక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద జయంతి ఉత్సవాలకు భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

## జగిత్యాలలో ఉచిత వేసవి శిబిరం

జగిత్యాల, మే 9 (ఈవార్తలు): జిల్లా కేంద్రంలో ధరూర్ క్యాంప్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆదివారం నుంచి ఈ నెల 25 వరకు ఉచిత వేసవి శిబిరం నిర్వహించనున్నారు. ఈ వేసవి శిబిరంలో 100 మంది విద్యార్థులకు మాత్రమే పాల్గొనే అవకాశం ఉంది. 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొనవచ్చు. ఆదివారం తల్లిదండ్రుల అంగీకార పత్రంతో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు మాత్రమే ఈ ఉచిత వేసవి శిబిరంలో పాల్గొనే అవకాశం ఉంటుంది. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో విద్యార్థులకు సృజనాత్మకత, లైవ్ స్కిల్స్, ఇండోర్ గేమ్స్, స్టోరీ టెల్లింగ్, కుట్లు అల్లికలు, భారతీయ భాష ఉత్సవాలు, క్విజ్ పోటీలు, స్థానిక సంప్రదాయక ఆటల పోటీలు నిర్వహిస్తారు. కంప్యూటర్ విద్యలో ప్రత్యేక శిక్షణ ఇస్తారు.



## ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, మే 9 (ఈవార్తలు): పేద ప్రజలకు గౌరవప్రదమైన సొంత ఇంటి కల నెరవేరేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని ఆలియా నాయక్ తండా గ్రామానికి చెందిన లావుడ్యా కైక తార్య నాయక్ దంపతుల ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి చీరలు కానుకగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అనేక కుటుంబాలకు శాశ్వత నివాసం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి సంతోష్, ఉప సర్పంచ్ గణేష్, ఎంపీఓ సుష్మ, ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు,.అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 3.71 సెకన్లలోనే రూబిక్స్ క్యూబ్ పరిష్కారం

బీజింగ్: స్పీడ్‌క్యూబింగ్ ప్రపంచంలో మరో కొత్త రికార్డు నమోదైంది. చైనాకు చెందిన యువకుడు జువానీ గెంగ్ 3ఇ3ఇ3 రూబిక్స్ క్యూబ్‌ను కేవలం 3.71 సెకన్ల సగటు సమయంలో పరిష్కరించి సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. ఈ అద్భుతమైన ప్రదర్శనతో స్పీడ్‌క్యూబింగ్ రంగంలో తన ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్ 26న చైనాలోని జెజియాంగ్‌లో జరిగిన 'డెకింగ్ స్మాల్ అండ్ స్పెషల్ 2026' పోటీల్లో గెంగ్ ఈ ఘనత సాధించాడు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ నివేదిక ప్రకారం ఈ పోటీలో అతను ఐదుసార్లు క్యూబ్‌ను పరిష్కరించాడు. అందులో వరుసగా 3.79, 4.33, 3.61, 3.74, 2.80 సెకన్ల సమయాలను నమోదు చేశాడు. వరల్డ్ క్యూబ్ అసోసియేషన్ (డబ్ల్యూసీఏ) నిబంధనల ప్రకారం, అత్యంత వేగవంతమైన, సగటును లెక్కించగా అది 3.71 సెకన్లుగా నమోదైంది.

ఈవార్తలు
# వినోదవాణి
CINEMA
ఆదివారం 10-5-2026, జగిత్యాల | www.evarthalu.com


## లవ్లీ చిత్రం



పూజా హెగ్డే





## అన్నపూర్ణ స్టూడియోస్ చేతికి
# తెలుగు 'కరుప్పు'

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న తాజా యాక్షన్ డ్రామా 'కరుప్పు' ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. విభిన్నమైన కథలను ఎంచుకోవడంలో ముందుండే సూర్య, ఈసారి ప్రముఖ దర్శకుడు ఆర్జే బాలాజీ దర్శకత్వంలో ఈ భారీ ప్రాజెక్ట్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల కోసం 'వీరభద్రుడు' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో విడుదల చేసేందుకు మేకర్స్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. 'వీరభద్రుడు' చిత్రానికి సంబంధించిన తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ రైట్స్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్ సొంతం చేసుకుంది. నాగార్జున నేతృత్వంలోని ఈ సంస్థ పంపిణీ బాధ్యతలు చేపట్టడంతో, తెలుగులో ఈ సినిమాకు భారీ స్థాయిలో థియేటర్లు దొరకడమే కాకుండా, ప్రమోషన్స్ కూడా నెక్స్ట్ లెవల్‌లో ఉండబోతున్నాయని అర్థమవుతోంది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చాలా కాలం తర్వాత సూర్య సరసన స్టార్ హీరోయిన్ త్రిష నటిస్తుండటం ఈ సినిమాపై అంచనాలను పెంచేసింది. వీరిద్దరి కెమిస్ట్రీ గతంలో పలు చిత్రాలతో ప్రేక్షకులను అలరించింది, ఇప్పుడు 'వీరభద్రుడు'తో రాబోతున్నారు.



# పెద్ది కోసం రంగంలోకి ధోనీ

రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' సినిమా ప్రమోషన్లు ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో లేవని మెగా అభిమానులు కొంత అసంతృప్తిగా ఉన్నారు. అయితే, ఈ లోటును పూడ్చేందుకు చిత్ర యూనిట్ ఒక భారీ 'మైండ్ బ్లాకింగ్' ప్లాన్‌తో సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ సినిమా క్రీడా నేపథ్యం (స్పోర్ట్స్ డ్రామా), ముఖ్యంగా క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుండటంతో, ప్రమోషన్ల కోసం ఒక అరుదైన అతిథిని తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం, జార్ఖండ్ రాజధాని రాంచీలో ఒక భారీ ఈవెంట్‌ను నిర్వహించాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. ఈ వేడుకకు భారత మాజీ కెప్టెన్, క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీని ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని చూస్తున్నట్టు గట్టిగా వినిపిస్తోంది. ధోనీ స్వస్థలం రాంచీ కావడం, అలాగే సినిమా క్రీడా నేపథ్యంలో ఉండటంతో ఆయన రాక సినిమాకు భారీ హైప్ తీసుకొస్తుందని మేకర్స్ నమ్ముతున్నారు. ప్రస్తుతానికి ధోనీతో సంప్రదింపులు జరుగుతున్నాయని, ఇంకా ఏదీ అధికారికంగా ఖరారు కాలేదని తెలుస్తోంది. ఒకవేళ ధోనీ ఈ ఈవెంట్‌కు హాజరైతే మాత్రం, నార్త్ ఇండియా మార్కెట్‌లో 'పెద్ది' సినిమాకు తిరుగులేని ప్రచారం లభిస్తుంది.





## ఎగ్జైటింగ్‌గా ఉన్నా: దిశాపటానీ

బాలీవుడ్ గ్లామర్ బ్యూటీ దిశా పటానీ, ఇప్పుడు గ్లోబల్ స్టేజ్ మీద తన సత్తా చాటడానికి సిద్ధమైపోయింది. ఆమె నటిస్తున్న మొదటి హాలీవుడ్ చిత్రం 'ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్' ట్రైలర్ తాజాగా విడుదలై సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ సినిమాలో దిశా తన మునుపెన్నడూ చూడని అత్యంత పవర్‌ఫుల్, యాక్షన్ అవతారంలో కనిపిస్తోంది. ఈ అంతర్జాతీయ ప్రాజెక్ట్‌లో దిశా పటానీ 'జెసికా' అనే కీలక పాత్రను పోషిస్తోందట. స్టాటిగార్డ్స్, హోలీగార్డ్స్ అనే రెండు పురాతన వర్గాల మధ్య జరిగే అద్భుత శక్తుల పోరాటమే ఈ సినిమా కథ. ఇందులో జెసికా పాత్ర కేవలం గ్లామర్ కోసమే కాకుండా, కథ మొత్తానికి కేంద్ర బిందువుగా ఉండబోతోంది. శత్రువులైన ఇద్దరు నాయకులకు పుట్టిన కూతురు కావడంతో, రెండు ప్రపంచాలను కలిపే వారధిలా ఆమె కనిపిస్తుందని తెలుస్తోంది. మానవాళి భవిష్యత్తును నిర్ణయించే శక్తి ఆమె దగ్గరే ఉంటుందని టాక్. తన హాలీవుడ్ ఎంట్రీ గురించి దిశా మాట్లాడుతూ.. "ఈ అంతర్జాతీయ ప్రాజెక్ట్ కోసం నేను ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నాను. మొదటి హాలీవుడ్ సినిమా అంటే కొంచెం భయంగా ఉన్నా, ఎంతో ఎగ్జైటింగ్‌గా ఉంది. ఇంత పెద్ద నటీనటులతో కలిసి పని చేయడం నాకు ఒక గొప్ప పాఠంలా అనిపించింది. కథలు చెప్పడానికి భాష లేదా భౌగోళిక సరిహద్దులు అడ్డంకి కావని నేను అర్థం చేసుకున్నాను. మన దేశంలో నేర్చుకున్న యాక్షన్ విద్యను గ్లోబల్ ప్లాట్‌ఫామ్ మీద చూపించడం నాకు ఎంతో గర్వంగా ఉంది" అని సంతోషం వ్యక్తం చేశారు.



# రౌడీ గుండెలపై కీర్తి సురేశ్ కాలు

విజయ్ దేవరకొండ నటిస్తున్న సినిమాల్లో రౌడీ జనార్దన్ కూడా ఒకటి. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి కిరణ్ కోలా దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన పోస్టర్, గ్లింప్స్‌కి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. విజయ్ బర్త్‌డే సందర్భంగా నేడు(మే 9) మరో కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. గతంలో రిలీజ్ చేసిన పోస్టర్‌లో సీరియస్ లుక్‌లో కనిపించిన విజయ్.. కొత్త పోస్టర్ లవ్లీగా కనిపించాడు. 'ప్రపంచంతో పోరాడతాడు.. ప్రేమకు లొంగిపోతాడు' అంటూ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. అందులో విజయ్ వర్షంలో తడుస్తూ, చేతిలో తుపాకీ పట్టుకొని కూర్చొని ఉండగా.. అతని గుండెలపై ఒక అమ్మాయి కాలు పెట్టినట్లు ఈ పోస్టర్ డిజైన్ చేశారు. ఇందులో విజయ్‌కు జోడీగా కీర్తి సురేశ్ నటిస్తున్నారు. తొలిసారి తూర్పుగోదావరి యాసలో విజయ్ మాట్లాడబోతున్నాడు. 80వ దశకం నేపథ్యంలో కథనం సాగుతుంది. ఈ ఏడాది చివరిలో ఈ చిత్రాన్ని విడుదల చేసే అవకాశం ఉంది.




### రణబాలి నుంచి అదిరిపోయే గ్లింప్స్

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు 'రణబాలి' చిత్ర బృందం అదిరిపోయే కానుకను అందించింది. విజయ్‌కి బర్త్‌డే విషెస్ తెలుపుతూ.. తాజాగా ఈ సినిమా నుంచి కొత్త గ్లింప్స్‌ను పంచుకుంది చిత్రయూనిట్. టాక్సీవాలా వంటి ఘనవిజయం తర్వాత విజయ్ దేవరకొండ, దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ భారీ చిత్రంపై ఇప్పటికే ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## విజయ్-త్రిష పెళ్లిలో డ్యాన్స్ చేస్తా: రాఖీ సావంత్

విజయ్, స్టార్ హీరోయిన్ త్రిష బంధం గురించి, వారిద్దరూ త్వరలోనే వివాహం చేసుకోబోతున్నారంటూ పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. ఈ చర్చ ఇలా ఉండగానే, బాలీవుడ్ వివాదాస్పద నటి రాఖీ సావంత్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అగ్నికి ఆజ్యం పోసినట్లు అయ్యాయి. 'త్రిష నాకు ఎప్పటి నుంచో తెలుసు. ఆమె ఎంతో కష్టపడి ఈ స్థాయికి చేరుకుంది. నాకు విజయ్ అంటే చాలా ఇష్టం, ఆయనతో కలిసి నటించాలని, కనీసం ఒక పాటలో అయినా స్టెప్పులు వేయాలని ఎప్పటి నుంచో కలలు కన్నాను. కానీ ఆ అవకాశం రాలేదు. ఇప్పుడు వారికీ పెళ్లి జరిగితే, కనీసం వారి మెహందీ వేడుకలో లేదా పెళ్లిలో అయినా డ్యాన్స్ చేస్తాను. ఆ సమయంలో ఇద్దరితో కలిసి ఫోటో దిగుతాను' అంటూ రాఖీ చెప్పుకొచ్చింది.






## లగాన్ దర్శకుడితో
# 25 ఏళ్ల తర్వాత!

భారతీయ సినిమా చరిత్రలో సరికొత్త రికార్డులు సృష్టించి 'లగాన్' వంటి బ్లాక్ బస్టర్‌ను అందించిన గ్రేట్ కాంబో దాదాపు 25 ఏండ్ల తర్వాత మళ్లీ కలువబోతున్నట్లు తెలుస్తుంది. బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్ట్ అమీర్ ఖాన్ తన వైవిధ్యమైన నటనతో, అశుతోష్ గోవారికర్ తన అద్భుతమైన మేకింగ్‌తో భారత క్రికెట్ దిగ్గజం లాలా అమర్‌నాథ్ జీవిత విశేషాలను వెండితెరపై ఆవిష్కరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ప్రతిష్టాత్మక బయోపిక్ కేవలం ఒక క్రీడాకారుడి బయోపిక్‌గానే కాకుండా, దేశ చరిత్రలోని కీలక ఘట్టాలను చూపించబోతున్నట్లు తెలుస్తోంది.



# మనసు మాటే వింటా

తానెప్పుడు తన మనసు చెప్పిందే వింటానని నటి శోభిత ధూళిపాళ్ల అన్నారు. తాజాగా ఒక ఇన్‌స్టా పోస్ట్‌కు రిప్లై ఇచ్చిన శోభిత పరిస్థితులు ఎలా ఉన్నా ఎప్పుడూ అంతరాత్మ మాట వినాలని సూచించారు. "పరిస్థితులు ఎలా ఉన్నా సరే.. మన మనసు చెప్పే వాటికే ప్రాధాన్యతనివ్వాలి. నేను అలా విన్నప్పుడే నా జీవితంలో ఎన్నో అర్థవంతమైన క్షణాలను ఆస్వాదించాను. కొన్ని సార్లు కష్టంగా అనిపించినా ఎప్పుడూ అంతరాత్మ మాటలనే నమ్ముతాను. మనసు మాట వినకుండా చేసిన పని ఏదీ కలిసి రాలేదు. ఆ విషయం నాకు తెలుసు. ఎప్పుడూ మనల్ని మనం గౌరవించుకుంటూ ముందుకు సాగాలి. జీవితం నదిపై సాగే ఒక చిన్న ప్రయాణం లాంటిది. ప్రతిదాన్ని ఆస్వాదించాలి" అని రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ రిప్లై వైరల్ అవుతోంది.



# రాజస్థాన్ బౌల్డ్

**రషీద్ స్పిన్‌కు విలవిల.. గుజరాత్ భారీ విజయం.. రాణించిన గిల్, సుదర్శన్**



**హ్యాట్రిక్ విజయాలతో జోరుమీదున్న గుజరాత్ టైటాన్స్ ప్లే ఆఫ్స్ అవకాశాల్ని మెరుగుపరచుకుంది. శనివారం జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై భారీ విజయంతో చెక్ పెట్టింది. ఓపెనర్లు గిల్ (84), సుదర్శన్(55) విధ్వంసంతో 229 రన్స్ కొట్టిన గుజరాత్ ఆపై రషీద్ ఖాన్(4-33)ల విజృంభణతో ఆతిథ్య జట్టును హడలెత్తించింది. రబడ(2-33) టాపార్డర్‌ను పడగొట్టగా.. మిస్టరీ స్పిన్నర్ రషీద్ మిడిల్ బ్యాటర్లను మడతపెట్టేశాడు. క్రీజులో నిలబడి ఆడేవారు కరువవ్వగా రాజస్థాన్ 152కే ఆలౌటైంది. ఏడో విజయంతో గుజరాత్ రెండో స్థానానికి దూసుకెళ్లింది.**

**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| హైదరాబాద్ | 11 | 7 | 4 | 14 |
| గుజరాత్ | 11 | 7 | 4 | 14 |
| పంజాబ్ | 10 | 6 | 3 | 13 |
| బెంగళూరు | 10 | 6 | 4 | 12 |
| రాజస్థాన్ | 11 | 6 | 5 | 12 |
| చెన్నై | 10 | 5 | 5 | 10 |
| కోల్‌కతా | 10 | 4 | 5 | 9 |
| ఢిల్లీ | 11 | 4 | 7 | 8 |
| ముంబై | 10 | 3 | 7 | 6 |
| లక్నో | 10 | 3 | 7 | 6 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ-ఓటమి పా-పాయింట్లు

పంతొమ్మిదో సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ దూకుడు కొనసాగుతోంది. లీగ్ దశ ఆఖర్లో పుంజుకున్న గుజరాత్ ఈసారి రాజస్థాన్ రాయల్స్‌ను భారీ తేడాతో ఓడించింది. భారీ లక్ష్యాన్ని ముందుంచి ప్రత్యర్థిని భయపెట్టిన గుజరాత్ బౌలర్ల కృషితో పెద్ద విజయాన్ని అందుకుంది. ఈ సీజన్‌లో రాజస్థాన్‌కు మెరుపు ఆరంభాలిస్తున్న ఓపెనర్ సూర్యవంశీ(36) దూకుడుగానే ఆడినా సిరాజ్ అతడి ఆట కట్టించాడు. ఆ తర్వాతి ఓవర్లో డేంజరస్ యశస్వీ జైస్వాల్(3)ని రబడ ఔట్ చేసి రాజస్థాన్‌కు షాకిచ్చాడు. కాసేపటికే హిట్‌మైర్(6)ను సైతం వెనక్కి పంపిన రబడ రెండో వికెట్ సాధించాడు. ఆ తర్వాత జురెల్(24) జతగా రవీంద్ర జడేజా(38) బౌండరీలతో గుజరాత్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. కానీ, రషీద్ ఖాన్ (4-33) ఒకే ఓవర్లో జురెల్, ఫెరీరా(4)లను వెనక్కి పంపి రాజస్థాన్‌ను కష్టాల్లోకి నెట్టాడు. అంతేనా.. ఆ తర్వాతి ఓవర్లో జడేజాను పెవిలియన్ పంపి రాజస్థాన్ ఆశలపై నీళ్లు చల్లాడు. హోల్డర్ సైతం వికెట్ల వేటతో గుజరాత్ గెలుపు మరింత తేలికైంది. చివరి బ్యాటర్‌ను వెనక్కి పంపిన హోల్డర్ ప్రత్యర్థిని 152కే పరిమితం చేయగా.. గుజరాత్ 87 పరుగుల భారీ విజయాన్నందుకుంది. అంతకుముందు గుజరాత్ టైటాన్స్ ఓపెనర్లు శతక భాగస్వామ్యంతో రెచ్చిపోయారు. ఆతిథ్య రాజస్థాన్ రాయల్స్ బౌలర్లను ఉతికేసిన శుభ్‌మన్ గిల్(84), సాయి సుదర్శన్(55)లు అర్ధ శతకాలతో భారీ స్కోర్‌కు పునాది వేశారు. వీరిద్దరూ ఔటయ్యాక.. జోస్ బట్లర్(13), హోల్డర్(7) క్రీజులో నిలవలేదు. దాంతో, 118తో పటిష్ఠంగా కనిపించిన గుజరాత్ ఒక్కసారిగా 185/3కి చేరింది. అయినా.. సుందర్(37 నాటౌట్), తెవాటియా(14 నాటౌట్)లు ధనాధన్ ఆడారు. డెత్ ఓవర్లలో ఈ ద్వయం దంచేయగా గుజరాత్ నిర్ణీత ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 229 పరుగులు చేసింది.





## జైస్వాల్, షఫాలీ వర్మకు నాడా నోటీసులు



భారత క్రికెటర్లు యశస్వి జైస్వాల్, షఫాలీ వర్మ గతేడాది నిర్ణీత డోప్ పరీక్షలకు హాజరుకాకపోవడంతో వారిద్దరికి జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ నోటీసులు జారీ చేసింది. నాడా రిజిస్టర్డ్ టెస్టింగ్ పూల్‌లో భాగమైన ఈ ఇద్దరు క్రీడాకారులు డోప్ టెస్టుకు హాజరుకాకపోవడానికి గల కారణాలను తెలియజేయకపోవడంతో వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. దీనిపై వివరణ ఇచ్చుకునేందుకు జైస్వాల్, షఫాలీకి అవకాశం కల్పించారు. నోటీసుల జారీ గురించి నాడా.. బీసీసీఐ, ఐసీసీకి సమాచారం అందించింది. గత ఏడాది డిసెంబర్ 17న యశస్వికి, నవంబర్ 7న షఫాలికి డోప్ పరీక్షలు నిర్వహించాల్సింది. అయితే వారు టెస్టు చేయించుకోవడానికి అందుబాటులో లేరు. దీంతో నాడా ఫిబ్రవరిలో వీరిద్దరి నుంచి వివరణ కోరింది. కానీ వీరు స్పందించకపోవడంతో తాజాగా నోటీసులు జారీ చేసింది. ఒక్కసారి డోప్ టెస్టుకు హాజరుకాకపోవడం డోపింగ్ నిబంధనల ఉల్లంఘన కిందకు రాదు. అయితే, 12 నెలల వ్యవధిలో మూడుసార్లు డోపింగ్ టెస్టులకు హాజరుకాకపోతే రెండేళ్లపాటు నిషేధం ఎదుర్కొనే ప్రమాదం లేకపోలేదు. జైస్వాల్ ప్రస్తుతం ఐపీఎల్ 2026లో బిజీగా ఉండగా.. జూన్ 12 నుంచి ప్రారంభం కానున్న టీ20 ప్రపంచ కప్‌నకు షఫాలీ వర్మ సన్నద్ధమవుతోంది.

## ఆ నాలుగే ప్లేఆఫ్స్‌కు: అశ్విన్

ఐపీఎల్ 2026 సీజన్ కీలక దశకు చేరుకుంటోంది. లీగ్ దశలో మరో 19 మ్యాచ్‌లు మిగిలుండగా ఇప్పటికీ ఒక్క టీమ్ కూడా ప్లే ఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకోలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించే జట్లను మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అంచనా వేశాడు. శుక్రవారం కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో పరాజయం పాలైన ఏడో ఓటమిని మూటగట్టుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ ముందంజ వేయడం కష్టమేనని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. కేకేఆర్ కూడా ప్లే ఆఫ్స్‌కు చేరకపోవచ్చని, ఒకవేళ ఆ జట్టు టాప్-4లో నిలిస్తే ప్రమాదకరంగా మారుతుందని పేర్కొన్నాడు. 'ఢిల్లీ క్యాపిటల్స్ ప్లే ఆఫ్స్ చేరుకునేలా కనిపించడం లేదు. కేకేఆర్ కూడా ఈ రేసులో వెనుకబడిపోతుందని నేను భావిస్తున్నాను. ఒకవేళ కోల్‌కతా అర్హత సాధిస్తే ఆ జట్టును ఆపడం కష్టం. నైట్‌రైడర్స్ పుంజుకున్న తీరు అద్భుతం. అందుకే కేకేఆర్ మూడు టైటిళ్లు సాధించింది. లీగ్ దశ ముగిసేసరికి సన్‌రైజర్స్ హైదరాబాద్, ఆర్సీబీ టాప్-2లో నిలుస్తాయని అనుకుంటున్నా. గుజరాత్ టైటాన్స్, రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్‌లలో ఏవైనా రెండు జట్లు మూడు, నాలుగు స్థానాల్లో ఉంటాయి. చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్‌కు రావాలంటే మిగిలిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడు గెలవాలి. లఖ్‌నవూతో జరగబోయే రెండు మ్యాచ్‌ల్లో సీఎస్కే విజయం సాధిస్తే కచ్చితంగా ప్లే ఆఫ్స్ చేరుతుంది' అని అశ్విన్ విశ్లేషించాడు.





## ప్లీజ్..ప్రైజ్‌మనీ ఇప్పించండి: గ్రాండ్ మాస్టర్ అభిజిత్ గుప్తా

భారత గ్రాండ్‌మాస్టర్, అర్జున అవార్డు గ్రహీత అభిజిత్ గుప్తా తనకు న్యాయం చేయాలంటూ క్రీడామంత్రిత్వ శాఖను ఆశ్రయించాడు. ఒడిశా ఓపెన్ నిర్వాహకుల నుంచి తనకు రావాల్సిన ప్రైజ్‌మనీని ఇప్పించాలని అభిజిత్ కోరాడు. ఐదు నెలలు కావొస్తున్నా నిర్వాహకులు స్పందించడం లేదని వాపోయిన అభిజిత్.. ఈ విషయంలో చొరవ తీసుకోవాలని క్రీడా మంత్రిత్వ శాఖకు విన్నవించుకున్నాడు. ఒడిశా ఓపెన్-2026(పదహారో అంతర్జాతీయ గ్రాండ్‌మాస్టర్ చెస్ ఫెస్టివల్) జనవరి 16 -24 మధ్య జరిగింది. ఈ టోర్నీలో అదరగొట్టిన అభిజిత్ గుప్తా విజేతగా అవతరించాడు. ఛాంపియన్‌గా నిలిచినందుకు అతడికి రూ. 5.5 లక్షల నగదు బహుమతి దక్కాలి. కానీ, నిర్వాహకులు మాత్రం ఈ టోర్నీ ముగిసి ఐదు నెలలు కావొస్తున్నా ప్రైజ్‌మనీ ఇవ్వలేదు. తనకు రావాల్సిన డబ్బుల గురించి అఖిల భారత చెస్ సమాఖ్యకు, ఒడిశా ఓపెన్ నిర్వాహకులకు అభిజిత్ పలు మార్లు లేఖలు రాసినప్పటికీ న్యాయం జరుగలేదు. దాంతో.. విసుగొచ్చిన అతడు క్రీడా మంత్రిత్వ శాఖను సంప్రదించాడు. 'ఒక క్రీడాకారుడిగా విజయాల కంటే ఓటములను అంగీకరించడం నేర్చుకుంటాం. ఇదంతా క్రీడలో భాగం. కానీ, టోర్నీలో గెలిచిన తర్వాత ప్రైజ్‌మనీ అందుకోకపనోవడం మరింతగా బాధిస్తుంది. ఈ ఏడాది జనవరిలో నేను ఒడిశా ఓపెన్ గెలుపొందాను. ప్రైజ్‌మనీని నెల రోజుల్లో ఇస్తామని నిర్వాహకులు హామీ ఇచ్చారు. నెల గడిచినా నాకు నగదు బహుమతి ఇవ్వలేదు. ఇదేంటీ? అని అడుగబోతే నిర్వాహకులు స్పందించడం లేదు. అఖిల భారత చెస్ సమాఖ్య ఆధ్వర్యంలో టోర్నీ జరిగినందున ఏఐసీఎఫ్ అధ్యక్షుడు, సెక్రటరీలను సంప్రదించాను. కానీ, దురదృష్టవశాత్తూ వారు కూడా ఈ సమస్యను పరిష్కరించలేకపోయారు.

## దేశవాలీ పోటీల్లో వినేశ్ ఫొగాట్‌పై నిషేధం

భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు భారత రెజ్లింగ్ సమాఖ్య భారీ షాక్ ఇచ్చింది. పారిస్ ఒలింపిక్స్ 2024 తర్వాత రిటైర్మెంట్ ప్రకటించి, నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని తిరిగి మ్యాట్‌పైకి అడుగుపెట్టాలనుకున్న ఆమె ఆశలకు బ్రేక్ వేసింది. మే 10 నుంచి 12 వరకు గోండాలో జరగనున్న నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో పాల్గొనకుండా ఆమెను నిషేధించింది. యాంటీ-డోపింగ్ నిబంధనల ఉల్లంఘన, క్రమశిక్షణా రాహిత్యం కింద డబ్ల్యూఎఫ్ఐ ఆమెకు 15 పేజీల షోకాజ్ నోటీసును జారీ చేసింది. దీనితో పాటు 2026 జూన్ 26 వరకు దేశవాళీ టోర్నీల్లో పాల్గొనకుండా ఆమెను అనర్హురాలిగా ప్రకటించింది. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ యాంటీ-డోపింగ్ నిబంధనల ప్రకారం.. రిటైర్మెంట్ తర్వాత మళ్లీ పోటీల్లోకి దిగాలంటే అథ్లెట్లు కనీసం ఆరు నెలల ముందుగా సమాచారం ఇవ్వాలి. వినేశ్ ఈ నిబంధనను పాటించలేదని డబ్ల్యూఎఫ్ఐ పేర్కొంది. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో బరువు నిబంధనల కారణంగా అనర్హతకు గురై దేశ ప్రతిష్టను దెబ్బతీశారని నోటీసులో ఆరోపించింది. యాంటీ-డోపింగ్ టెస్ట్ నిబంధనల్లో భాగంగా తన ఆచూకీ తెలపడంలో విఫలమయ్యారని పేర్కొంది. మార్చి 2024లో అప్పటి ఐఓఏ తాత్కాలిక కమిటీ నిర్వహించిన ఎంపిక ట్రయల్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా రెండు వేర్వేరు బరువు విభాగాల్లో పాల్గొనడాన్ని తప్పుబట్టింది. ఈ ఆరోపణలపై వివరణ ఇచ్చేందుకు వినేశ్‌కు డబ్ల్యూఎఫ్ఐ 14 రోజుల గడువు ఇచ్చింది.

## ఫిఫా - 2026 ఓపెనింగ్ సెర్మనీలో నోరా ఫతేహి

బాలీవుడ్ స్టార్ డ్యాన్సర్, నటి నోరా ఫతేహి మరోసారి ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో ఫిఫా వరల్డ్‌కప్ ముగింపు వేడుకల్లో తన అద్భుతమైన డ్యాన్స్ ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నోరా.. ఇప్పుడు ఫిఫా ప్రపంచకప్ 2026 ప్రారంభ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ మెగా టోర్నీ ఓపెనింగ్ సెరెమనీకి సంబంధించిన ప్రముఖుల జాబితాను నిర్వాహకులు తాజాగా విడుదల చేశారు. అందులో నోరా ఫతేహి పేరు ఉండటంతో ఆమె అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తన ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్స్, గ్లోబల్ స్టేజ్‌పై మెరిసే ప్రెజెన్స్‌తో మరోసారి ఫుట్‌బాల్ ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించనున్నారు. గత ఫిఫా వరల్డ్‌కప్‌లో నోరా చేసిన ప్రదర్శనకు ప్రపంచవ్యాప్తంగా మంచి స్పందన లభించింది. ముఖ్యంగా ఆమె స్టేజ్ ఎనర్జీ, ఇంటర్నేషనల్ స్టైల్ ప్రెజెంటేషన్‌కు ఫుట్‌బాల్ అభిమానులు ఫిదా అయ్యారు. ఇప్పుడు మరోసారి ఆమెకు ఈ ప్రతిష్టాత్మక వేదికపై అవకాశం రావడం విశేషంగా మారింది. ఫిఫా ప్రపంచకప్ 2026 ప్రారంభ వేడుక కెనడాలోని టొరంటో నగరంలో ఘనంగా నిర్వహించనున్నారు.



# అంగట్లో అందాల బొమ్మ

లైకుల కోసం
బొడ్డు చూపిస్తున్నారు..

వ్యూస్ కోసం ఎద
అందాలు పరిచేస్తున్నారు..

ఫాలోవర్ల కోసం
పిర్రలు పైకెత్తుతున్నారు..

షేర్ల కోసం నడుమును
మడతేస్తున్నారు..

కామెంట్ల కోసం
కామక్రీడలాడుతున్నారు..

షార్ట్స్, షేర్‌చాట్లలో
అసహ్య దృశ్యాలు!

రీల్స్‌లో వినిపించే
బూతుల మాటలు!!

అంతర్జాల అంగడిలో
అశ్లీల అందాలు!

సోషల్ మీడియాలో
రెడ్‌లైట్ ఏరియాలు!!

**శ్రావణ వాణి**

> సెమీ న్యూడ్ ఫొటోలు..
> సాఫ్ట్ పోర్న్ వీడియోలు..
> పైసల కోసం ఎక్స్‌పోజింగ్..
> సబ్‌స్క్రిప్షన్‌లో ఎక్స్‌క్లూజివ్..
> అందాల ఆరబోతలు..
> అసహ్యకర ఆర్తనాదాలు..

డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ప్రతి ఒక్కరి జీవితంలో అంతర్భాగమైంది. ముఖ్యంగా రీల్స్, షార్ట్ వీడియోల ట్రెండ్ యువతను ఉర్రూతలూగిస్తోంది. ఈ క్రమంలో లైకులు, వ్యూస్, ఫాలోవర్ల కోసం సాగుతున్న పాకులాట ఆరోగ్యకరమైన పరిమితులను దాటి వెళ్తోంది. తమలోని ప్రతిభను చాటుకోవడానికి వేదికలుగా నిలవాల్సిన సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, దురదృష్టవశాత్తు అశ్లీలతకు, ఎక్స్‌పోజింగ్‌కు అడ్డాగా మారుతున్నాయి. తక్కువ సమయంలో ఎక్కువ గుర్తింపు పొందాలనే తాపత్రయంతో కొందరు యువతులు విచక్షణ మరిచి ప్రవర్తిస్తున్నారు. సోషల్ మీడియాలో ఫాలోవర్లను పెంచుకోవడానికో, వ్యూస్ పెంచుకోవడానికో.. అందాలను ప్రదర్శిస్తూ హద్దులు దాటుతున్నారు. సినిమాల్లో గ్లామర్‌కూ ఓ హద్దు ఉంటుంది. కానీ, రీల్స్, షార్ట్స్, షేర్‌చాట్ తదితర ప్లాట్‌ఫాంలలో ఆ హద్దు దాటిపోతోంది. ఫేం కోసం అర్ధనగ్న ప్రదర్శనలు చేస్తున్నారు. సంప్రదాయం, సంస్కారం అన్న పదాలకు అర్థం మార్చేస్తూ, శారీరక ప్రదర్శన ద్వారా నెటిజన్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. వ్యక్తిత్వాన్ని కాకుండా శరీరాన్ని మార్కెట్ చేస్తున్నారు. రీల్స్ సంస్కృతి పెరిగిన తర్వాత అసభ్య హావభావాలు, అసౌకర్యకర దుస్తులు, ద్వంద్వార్థ సంభాషణలు, అసభ్య నృత్యాలు కామన్ అయిపోయాయి. ఒకప్పుడు సిగ్గుగా భావించిన విషయాలు ఇప్పుడు ట్రెండ్‌గా మారుతున్నాయి. మహిళ తనను తాను వ్యక్తిగా కాకుండా వీక్షణ వస్తువుగా చూపిస్తోంది. ఇటీవల ఓ తెలుగు యాంకర్, నటి తన హద్దులు దాటేసింది. నటనకు, ప్రతిభకు ప్రాధాన్యం ఆ నటి.. 'ఎక్స్‌పోజింగ్'నే ఆదాయ వనరుగా మార్చుకుంది. విచ్చలవిడిగా అందాల ప్రదర్శన చేయడం, అసభ్యకరమైన భంగిమల్లో ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేస్తోంది. గ్లామర్‌కు, అసభ్యతకు మధ్య ఉండాల్సిన సన్నని గీత చెరిపేస్తూ సాఫ్ట్ పోర్న్‌ను ప్రదర్శిస్తోంది. సినిమా అవకాశాలు తగ్గినప్పుడు లేదా పాపులారిటీ కోసం ఇలాంటి అడ్డదారులు తొక్కుతూ తమ గౌరవాన్ని అంతర్జాల అంగడిలో రేటు కడుతున్నారు.

ఇక, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వాడకం ఈ పరిస్థితిని మరింత జటిలం చేస్తోంది. డీప్ ఫేక్ సాంకేతికతను ఉపయోగించి సెలబ్రిటీల, సాధారణ మహిళల ముఖాలను అశ్లీల వీడియోలకు జోడించి సోషల్ మీడియాలో వదులుతూ కొందరు వికృతానందం పొందుతున్నారు. దీనివల్ల మహిళల గౌరవం దెబ్బతింటోంది. వ్యక్తిగత గోప్యతకు భంగం కలుగుతోంది. ఎవరి ఫొటోనైనా తీసుకుని అసభ్యకర వీడియోల్లో జోడించే స్థాయికి టెక్నాలజీ దుర్వినియోగం చేరింది. ఇది ఒక్క వినోద సమస్య కాదు; సైబర్ నేరాలకు, మానసిక వేధింపులకు కారణమవుతోంది.



శ్రావణ్ కుమార్ బొమ్మకంటి,
ఎడిటర్, ఎంటెక్, ఎల్ఎల్‌బీ
9581291919,
9441291919

సోషల్ మీడియా సంస్థల అల్గారిథమ్స్ కూడా వివాదాస్పదమైన, రెచ్చగొట్టే కంటెంట్‌ను త్వరగా వైరల్ చేస్తాయి. ఈ 'వైరల్' మాయలో పడి, రేపటి పర్యవసానాలను ఆలోచించకుండా క్షణికానందం కోసం చాలా మంది అసభ్య కంటెంట్ సృష్టిస్తున్నారు. ఇది కేవలం సృష్టించే వారికే కాకుండా, చూసే సమాజంపై, ముఖ్యంగా చిన్న పిల్లల మనస్తత్వాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

అభివ్యక్తి స్వేచ్ఛ పేరుతో అన్నింటినీ సమర్థించడం సరైంది కాదు. స్వేచ్ఛకు బాధ్యత కూడా తోడుగా ఉండాలి. సోషల్ మీడియా సంస్థలు కఠిన నియంత్రణలు తీసుకురావాలి. అసభ్యకర, డీప్‌ఫేక్ కంటెంట్‌పై వేగంగా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం కూడా సైబర్ చట్టాలను మరింత కఠినతరం చేయాలి. ముఖ్యంగా పిల్లలు, యువతకు డిజిటల్ నైతిక విలువలపై అవగాహన కల్పించడం అత్యవసరం. సాంకేతికత మనిషి అభివృద్ధికి ఉపయోగపడాలి గానీ, సమాజాన్ని విలువల సంక్షోభంలోకి నెట్టే సాధనంగా మారకూడదు. వినోదం పేరుతో అశ్లీలతను ప్రోత్సహించడం, వ్యక్తిత్వాన్ని లైకుల కోసం అమ్ముకోవడం సమాజానికి మంచిది కాదు. ఇప్పటికైనా కుటుంబాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వాలు, సోషల్ మీడియా సంస్థలు కలిసికట్టుగా బాధ్యతాయుతమైన డిజిటల్ సంస్కృతిని నిర్మించాల్సిన అవసరం ఉంది. కంటెంట్ సృష్టించే వారు తమ బాధ్యతను గుర్తించాలి. గుర్తింపు అనేది ప్రతిభ ద్వారా రావాలే తప్ప, దిగజారుడుతనం ద్వారా కాదని గ్రహించాలి. యువత ఏ రకమైన కంటెంట్ చూస్తున్నారు, ఏం పోస్ట్ చేస్తున్నారనే అంశంపై తల్లిదండ్రుల నిఘా అవసరం. అశ్లీలతను ప్రోత్సహించే ఖాతాలను బ్లాక్ చేయడంతో పాటు, ఏఐని దుర్వినియోగం చేసేవారిపై సైబర్ చట్టాల ద్వారా కఠిన చర్యలు తీసుకోవాలి. అసభ్య కంటెంట్‌ను ప్రోత్సహించే ఖాతాలపై చర్యలు, వయస్సు నిర్ధారణ వ్యవస్థలు, కంటెంట్ ఫిల్టర్లు మరింత బలోపేతం కావాలి. కుటుంబ వ్యవస్థ, విద్యా సంస్థలు, సమాజం కూడా తమ పాత్రను నిర్వర్తించాలి. పిల్లలతో సంభాషణలు తగ్గిపోవడం, డిజిటల్ వినియోగంపై పర్యవేక్షణ లేకపోవడం పరిస్థితిని మరింత దిగజారుస్తోంది. స్వేచ్ఛకు సంస్కారం అనే హద్దు అవసరం.

## చట్టానికి చిక్కితే చిక్కులే..

ఏదైనా అభ్యంతరకరమైన కంటెంట్‌ను తొలగించడానికి సోషల్ మీడియా సంస్థలకు ఇచ్చే గడువును 36 గంటల నుండి కేవలం 3 గంటలకు తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. భారత శిక్షా స్మృతి, ఐటీ చట్టంలోని సెక్షన్ 67 ప్రకారం, అశ్లీలతను లేదా అసభ్యకరమైన సమాచారాన్ని ఎలక్ట్రానిక్ రూపంలో ప్రచురించడం నేరం. తెలుగు నటి కేసులో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇదే అంశంపై ఫిర్యాదు చేశారు. ఎలక్ట్రానిక్ రూపంలో అసభ్య, అశ్లీల కంటెంట్‌ను ప్రచారం చేస్తే మొదటి తప్పిదంగా గరిష్ఠంగా 3 సంవత్సరాల జైలు, రూ.5 లక్షల వరకు జరిమానా పడుతుంది. మళ్లీ అదే తప్పు చేస్తే గరిష్ఠంగా 5 సంవత్సరాల జైలు, రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తారు. లైంగిక చర్యలు స్పష్టంగా కనిపించే కంటెంట్ పోస్టు చేస్తే మరింత కఠిన శిక్ష ఉంటుంది. మొదటి తప్పిదమైతే 5 సంవత్సరాల వరకు జైలు, జరిమానా పడుతుంది. మళ్లీ చేస్తే 7 సంవత్సరాల వరకు జైలు, జరిమానా విధిస్తారు. చిన్నారుల ఫొటోలు లేదా వీడియోలు ఉంటే అత్యంత తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. పోక్సో చట్టం కింద చర్యలు తీసుకుంటారు. ఈ కేసులో దీర్ఘకాల జైలు శిక్ష పడుతుంది. వీడియో రూపొందించిన వ్యక్తికే కాదు, దాన్ని షేర్ చేసినా, ఫార్వర్డ్ చేసినా, ప్రచారం చేసినా కూడా కేసులు నమోదవుతాయి.



This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.